# చోటు

''యిదో ముసిలాయినా! నా చోట్లోకి రావొద్దు. రొంత జరుగుతు. యీ పక్కనించీ నువ్వూ, ఆ పక్కనించీ ఆ సన్న పిల్లోడూ మోచేతలతో కుమ్మిపారేస్తాంటే నేనేపై పోవాల్ల?'' అంటూ విసుగ్గా అరిచాడు మద్దులేటి.

మూరెడెత్తున్న పేవ్‌మెంట్ చివర్లో పాత న్యూస్ పేపరుపైన గొంతుక్కూచున్న ముసలాయన వులిక్కిపడి కళ్లు తెరిచి చూశాడు. మోకాళ్లపై పెట్టుకున్న పాత నల్లరంగు జిప్ బాగ్ పక్కపాకెట్టులోంచీ నీళ్ల బాటిల్‌పైకి తీసి, గుటగుటా రెండు గుక్కల నీళ్లు తాగాడు. చేతిలోకి పుడిసెడు నీళ్లు తీసుకుని ముఖం కడుక్కున్నాడు.

నగరపు వీధుల్లో దారి తప్పిన ఆగంతకుడిలాంటి పిల్ల తెమ్మెరొకటి మద్దులేటి శరీరాన్ని తాకుతూ పలకరించి, తల వెంట్రుకల్ని రేపుతూ కవ్వించి అలాఅలా సాగిపోయింది. ముంచుకొస్తున్న నిద్రనుంచీ తప్పించుకోవడం కోసం కళ్లు నులుముకుంటూ వోసారి జెమినీ ఫ్లయ్ వోవర్ వైపునకు దృష్టిని సారించాడు అతను. నాలుగువైపులా రకరకాలుగా వంపులు తిరిగిన సిమెంట్ బ్రిడ్జీలతో అయిదారు మీటర్ల ఎత్తున్న జెమినీ ఫ్లయ్ వోవర్ టెంటికల్స్ చాపిన కాంక్రీటు అమీబాలా చిత్రంగా కనిపిస్తోంది. దాదాపు రెండు మీటర్ల పొడవున్న అమెరికన్ కౌన్సిలేట్ జనరల్ భవనపు ప్రహరీ గోడ పొడవునా, రోడ్డు చివర పేవ్‌మెంట్ పైన కూర్చున్న మనుషుల క్యూ శరీరంనుంచీ తెగిపడిన బల్లిపిల్ల తోకలా నిస్సారంగా సోలిపోయి వుంది. చుట్టూ కనిపిస్తున్న భవన సముదాయాలముందు దీపాల బారులు వెలుగుతున్నాయి. రోడ్డుపైన జనసంచారం లేదు. రుసరుసలూ గుసగుసలూ తప్ప మరో శబ్దం కూడా వినిపించడం లేదు. ఆకాశంలో తడబడుతూ తిరుగుతున్నట్టున్న చంద్రవంక నేలపైని విద్యుద్దీపాలతో పోటీ పడలేక వెలవెలబోతోంది. యెంబసీలోంచీ రోడ్డుపైకి బారులు చాపిన చెట్ల కొమ్మలు క్యూలో కూర్చున్న మనుషులను నిద్రలోకి జారిపోనివ్వకుండా మంచు బిందువుల్ని రాలుస్తూ కాపలా కాస్తున్నాయి. అక్కడక్కడా

కొందరు న్యూస్‌పేపర్లూ, టవళ్లూ, దుప్పట్లలాంటివి పరుచుకుని నిద్రతో కసరత్తులు చేస్తున్నారు.

రుమాలుతో ముఖం తుడుచుకుంటూ వోసారి నిట్టూర్చి ''టయమెంతయింది బాబూ'' అని అడిగాడు ముసలాయన.

అటువైపు కూర్చున్న యిరవయ్యేళ్ల కుర్రాడు చేతిగడియారంకేసి చూసి ''రెండుంకాలు'' అన్నాడు.

తనవి గానట్టున్న లూజు లూజు టీ షర్టూ ప్యాంటుల్లో క్రోటన్ మొక్కలా బలహీనంగా కనిపిస్తున్న ఆ అబ్బాయిని తేరిపారజూస్తూ ''నీదిగూడా ఆంధ్రానేనా?'' అని అడిగాడు మద్దులేటి.

''మాది మెడ్రాసే! కానీ కొంచుం కొంచుం తెలుగు వస్తాది'' అంటూ ముసిముసి నవ్వులు నవ్వాడా అబ్బాయి.

''నిద్ర ముంచుకొస్తోంది. మరేమీ అనుకోకుండా నా బాగ్ కొంచెం చూస్తూండు నాయనా! నేనీ పక్క తలపెట్టుకుని కొంచెం నడుం వాలుస్తాను'' అంటూ ముసలాయన పేవ్‌మెంట్ పైనే శరీరాన్ని సర్దుకున్నాడు.

జిప్ బాగ్‌పైనున్న అడ్రస్సును ''యస్.వెంకట్రావు'' అంటూ కూడి కూడీ చదువుకున్న తర్వాత ''గుడివాడ నించీ యింత దూరమేలొచ్చినావు పెద్దాయినా? హైద్రాబాదు దగ్గిర గదా మీకు?'' అని అడిగాడు మద్దులేటి.

వెంకట్రావు కనురెప్పలు పైకెత్తి ''హైద్రాబాదులో వీసాలిచ్చే అంబసీ యెక్కడుంది? భలే వాడివే! కంప్లీట్ సౌత్ యిండియాకంతా యిదొకటే గతి!'' అంటూ మద్దులేటి కేసి వోసారి ప్రశ్నార్థకంగా చూసి, మళ్లీ కళ్లు మూసుకున్నాడు.

విశ్రాంతి తీసుకుంటున్న రోడ్లకు నిద్రాభంగం కలుగుతుందేమోనన్న భయంతో, అతి తక్కువ శబ్దం చేస్తూ పరతెంచిన లూనాపైన్నుంచీ వో కుర్రాడు కిందికి గెంతి ''నీ వ్యూటుకుపోయి తూంగుబో! నానింగ పుక్కార్రేన్'' (నువ్వింటికెళ్లి నిద్రపో! నేనిక్కడ కూర్చుంటాను) అంటున్నాడు పదిమంది కవతలున్న వ్యక్తితో. అక్కడ కూర్చున్న వ్యక్తి లూనాపైకెక్కి రోడ్లలో చీకటిని అన్వేషిస్తూ వెళ్లిపోయాడు. అతడు ఖాళీ చేసిన స్థలంలో ఆగంతకుడు సర్దుకుపోయాడు.

''యీ పేవ్‌మెంట్ ముళ్ల కంపలాగుంది'' అని విసుక్కుంటూ ఆవులించి, యిక నిద్రరాదని నిర్ణయించుకున్నట్టుగా ''అయితే యెవరి కోసం యీ క్యూలో కూర్చున్నావు నువ్వు?'' అంటూ మద్దులేటిని కబుర్లలోకి రాదీశాడు వెంకట్రావు.

మద్దులేటి చిరాకుపడుతూ అతడికేసితిరిగి ''అదిసరేగానీ, నువ్వే స్టేట్‌కు పోతాండావు?'' అని తానూ వో ప్రశ్ననే సంధించాడు.

''టెక్సాస్‌కెళ్లాలి. అక్కడ మా అమ్మాయి డాక్టరు...'' తనపైన ఆ మాత్రం అక్కర

చూపెట్టే వ్యక్తి దొరకడంతో వెంకట్రావు వుత్సాహంతో చెప్పుకుపోసాగాడు - ''మా అల్లుడు కూడా డాక్టరే! యెంబీబీయస్ చదివిన అమ్మాయి కోసం వెతికి వెతికి మా అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. మా వియ్యంకుడూ వాళ్లుంటున్నది లాస్ యేంజెల్స్‌లో.... వాళ్లకు గ్రీన్ కార్డుంది. యింతకూ వాళ్లు మన బందరువాళ్లే! యేడాది క్రితం మాకు మనవడు కూడా పుట్టాడు. మా అమ్మాయి వాడి ఫోటోలు కూడా పంపింది పోస్టులో. యెర్రగా, బొద్దుగా యెంత బావున్నాడనుకున్నావ్?...''

''మనవడ్ని చూసొస్తావని అమెరికాకు పోతాండావా?'' ముసలాయన్ని మాటల్లో పెట్టడం కోసం అన్యమనస్కంగానే ప్రశ్నించాడు మద్దులేటి.

''పాస్‌పోర్టొచ్చి పది నెలలై పోయింది. వీళ్లేమో వీసా యివ్వటం లేదు. మా అమ్మాయి గర్భవతవుతూనే వాళ్లమ్మని పంపమని రాసింది. పోయిన యేడాది యేప్రిల్ నెల్లో నా భార్య కూడా స్టేట్స్ కెళ్లిపోయింది. రిటైరయ్యాక వెళ్దాంలే అని నేనాగిపోయాను. నేను లాస్ట్ ఆగస్టులో రిటయిరయ్యాన్లే! అక్కడే హెడ్మాస్టరుగా చేసేవాణ్ణి! యింతలో యీ అమెరికా వాళ్ల పాలసీ మార్చేస్తారనీ, వీసా దొరకటం కష్టమైపోతుందనీ నాకేం తెలుసు? డిసెంబరులో వోసారి వీసా కోసం వచ్చానిక్కడికి. 'రీజన్స్ ఆర్ యినడిక్వేట్' అని తిప్పి పంపేశారు. యిప్పుడు మళ్లీ ప్రయత్నిస్తున్నాను. యీసారేమంటారో?'' కాస్సేపాగి మళ్లీ నెమ్మదిగా మొదలెట్టాడు వెంకట్రావు. ''వున్నదొకే కూతురు. అదీ స్టేట్స్‌కెళ్లిపోయింది. పెళ్లాం కూడా వెళ్లిపోయి యేడాది దాటింది. చుట్టా బంధువులున్నారన్న మాటే గానీ యెవరూ సమయానికి పలకరు. స్వయంపాకమే గతి. అందరూ వుండి గూడా వొంటరి బ్రతుకైపోయింది. యీ దేశంలో యింతమందున్నారు నా వొక్కగానొక్క కూతురు మాత్రం యిక్కడ చోటు దొరక్కపోయినట్టు అమెరికా కెళ్లిపోయింది. కూతురి బిడ్డను చూసుకోడం కోసం నా భార్య కూడా వెళ్లిపోయింది. సరే నేనూ పోతాను బాబూ అంటే యీ అంబసీ వాళ్లు వినటం లేదు. నేను వెళ్లి అక్కడే సెటిలయిపోతానని వాళ్ల అనుమానమట! వొకవేళ సెటిలయిపోయినా వీళ్ల సొమ్మేం పోయింది? నేనొక్కడు అమెరికాకు బరువైపోయానా చెప్పు?'' యెండుటాకులపైన వేడి గాలి సోకినట్టుగా జీరబోయిన వెంకట్రావు గొంతుక కీచుకీచుగా పలికింది. ''వీసా దొరగ్గానే ఫోన్ చెయ్యి, టికెట్టుకు డబ్బు పంపుతానని రాసింది మా అమ్మాయి. మా డబ్బుతో మేం వెళ్తామంటే వీళ్లొప్పుకోవటం లేదు. అమ్మ లేకపోతే బేబీ సిట్టర్‌కు బోలెడంత తగలెయ్యాలంటుంది మా అమ్మాయి. వాళ్లక్కడ, నేనిక్కడ. మధ్యలో యినపతెర మాదిరిగా యీ వీసా...

సముద్రం నుంచీ తప్పించుకొచ్చిన పిచ్చిగాలొకటి నానా రబస చేస్తూ క్యూనొక్కసారి వూపి పారేసింది. నిద్రలో తూగుతున్న వాళ్లు కొందరు యేం జరిగిపోయిందోనని వులిక్కిపడి కళ్లు తెరిచి తమ తమ సామాన్లని గుండెలకేసి అదుముకోసాగారు. క్యూలో కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్న కుర్రాళ్లు కొందరు వాళ్ల తాపత్రయాన్ని చూసి పడీపడీ నవ్వసాగారు. చెట్లపైన్నుంచీ మంచు బిందువులతో బాటూ యెండుటాకులు గూడా కిందికి రాలాయి. పాత దినపత్రికొకటి అంబసీ గోడపైని యినుప కమ్మల్లో తగులుకుని

చీలికలు పేలికలుగా చినుగుతూ జెండాలా రెపరెపలాడుతోంది.

యెంత ప్రయత్నించినా ఆగకుండా నిద్ర ముంచుకొస్తోంది మద్దులేటికి తూలి పక్కనున్న అబ్బాయి పైన పడ్డాడు. ఆ అబ్బాయి విసుగ్గా నెట్టడంతో వులిక్కిపడి కళ్లు తెరిచాడు. రెండు చేతులతో ముఖంపైన రుద్దుకుంటూ ఆవులించి, నిద్రనాపుకోడానికి మాటల్లో పడడమొకటే మార్గాంతరమని స్ఫురించడంతో ''నువ్వే స్టేట్‌కు పోతాండావు?'' అని ఆ అబ్బాయినే అడిగాడు.

''హోస్టన్ యూనివర్శిటీలో యెంటెక్‌లో జాయిన్ అవను పోతావుండాను'' అంటూ అతను తన చేతుల్లోని ఫైలును మరింత గట్టిగా పట్టుకున్నాడు.

''యిక్కడెక్కడా యెంటెక్‌లో సీటు దొరకలేదా?'' అని ప్రశ్నించాడు మద్దులేటి.

అతనో చిరునవ్వు నవ్వి ''దొరికితే మట్టుం యెవుడు చేరేది? యిక్కడ స్టడీసంతా యూజులేస్... వొకవేళ డిగ్రీ వచ్చినా జాబ్ గారెంటీ లేదు. అమెరికాలో స్టడీస్‌లో వుండంగానే జాబ్ దొరకతాది. మెరిట్‌కు వాల్యూ వుండాది. మంచి వొరుంబడి. కంఫర్టబుల్ లైఫు. యిక్కడేముండాది? కరప్షనూ నెపొటిజమూ!'' అన్నాడు.

''అక్కడ సీటెట్ల దొరికింది?''

''టోఫెల్ పాసయినాక యెనిమిది యూనివర్శిటీలకు అప్లయి చేసినాను. హోస్టన్‌లో సీటొచ్చింది...''

''స్కాలర్‌షిప్పు యిచ్చినారా?''

''యిప్పుడేమీ యీలేదు. కానీ అక్కడికి పోయినాంక స్కాలర్‌షిప్పేదయినా గ్రాటవతింది. రాకపోయినా ప్రాబ్లం లేదు. పార్ట్‌టైం జాబ్ దొరికితే మెయిన్‌టెన్సుకు సరిపోతింది. యిప్పుడు విమానం టికెట్లకూ, ఆరునెల్ల దాంకా సస్టయినింగుకూ కొంచెం ఖర్చు పెట్టుకోవాల్ల...''

''యెంతయితింది? వొక పదివేలు సరిపోతిందా?''

అతను విస్తుపోతూ ''పాస్‌పోర్టుకూ వీసాలకే చానా అయింది. టికెట్టుకే ముప్పయి నలభై వేలు అవతాది. బ్యాంకులో త్రీ లాక్స్ అకౌంటు చూపించాల్ల...'' అన్నాడు.

''అంటే నువ్వమెరికాకు పొయ్యేదానికి మూడున్నర లక్ష దాంకా ఖర్చు పెడతాండావా? మీనాయినేం చేస్తాడు? యాపరమా?...'' మద్దులేటి కళ్లార్పడం సైతం మరచిపోయి అతనివైపే చూస్తూ అడిగాడు.

''కాదు... బ్యాంకిలో క్లర్కు...''

''అయితే కష్టమేనే! యింత లెక్కొట్ల రెడీ జేసినాడు?''

చలనం లేని చెరువులా కనిపిస్తున్న మదరాసు ఆకాశంలో, తక్కువ యెత్తులో యేదో విమానమొకటి యీత కొడుతున్నట్టుగా సాగిపోతోంది, మిడత కనుగుడ్ల లాంటి దీపాల్ని అటూయిటూ వూపుకుంటూ. క్యూలో కాస్త దూరంలో స్వెట్టరు తొడుక్కుని తలపై

పోల్డరు హేటు పెట్టుకున్న యాభైయేళ్ళ వ్యక్తి - చూడగానే ధనవంతుడని తెలిసి పోతున్నవాడు - ఖరీదైన పొగచుట్టను తగలేస్తున్నాడు. పొగాకు వాసన తెరలు తెరలుగా ముంచుకురాగా యిద్దరు ముగ్గురు ఖణేలు ఖణేలుమని దగ్గుతున్నారు.

త్రోసుకొస్తున్న పొడి దగ్గును అణచుకునే ప్రయత్నం చేస్తూ టీ షర్టు కుర్రాడు అన్నాడు - ''మా సెకండ్ సిస్టర్‌కు లాస్టియరే మారేజయింది. యింకా డెట్సుండాయి. కానీ మా ఫాదరు కొంచెంగూడా బేజారు పల్లేదు. బ్యాంకు వన్ లాక్ దాంకా లోనిచ్చింది. మా నేటివ్ ప్లేస్ కనకమ్మ సత్రం - తిరుత్తణికిట్టల్ టెన్ కేయమ్స్ - లోఫైవ్ యేకర్స్ వెట్ లాండ్ వుండాది మాకు. దాన్ని అడమాణం పెట్టిండాం. మా ఫాదరిప్పుడు త్రీ తౌజండ్స్ దాంకా నెలనెలా యింట్రస్టు గట్టాల. రిటయిరనంక వచ్చే అమౌంటుతో అంతా క్లియర్ చేసేస్తానంటా వుండారు. కానీ నేనే వొప్పుకోలేదు. స్టేట్స్‌లో రెండేళ్లు జాబ్ చేసినానంటే అంతా నేనే క్లియర్ చేసూడస్తాను. పాపం, మా ఫాదర్‌కు మా వల్ల యెప్పుడూ ప్రాబ్లమ్సే! జాబొచ్చినాంక అమౌంట్ పంపించి ఆయనను బాగా రెస్టైత్తుకోమని చెప్తాను...''

***

''ఆరు నూరైనా, నూరు ఆరైనా రొంత తావుగూడా యిచ్చేలే! కర్రోళ్ల నల్లన్న కొడుకు కర్రోళ్ల మద్దయ్య యిట్ట బుడ్డ బెదిరింపులకంతా బెదిరిపొయ్యేదిలే! వూరు వూరంతా వొకటై పైనబడినా జంకేదిలే. సై అంటే సై...'' పూరింటి మట్టి గోడపైన వాలిపోయి, రొప్పుతూనే, నలుపుకంటే తెలుపే యెక్కువగా కనిపిస్తున్న బవిరి మీసంపైన చెయ్యేసాడు మద్దయ్య.

దాదాపు ఆరడుగుల వ్యాసార్ధంతో కట్టిన పూరి గుడిసెలో నాల్గైదు మట్టి బానలూ, రెండు మూడు సత్తు గిన్నెలూ, వొక రంగు వెలిసి పోయిన ట్రంకుపెట్టే, దండెంపైన కొన్ని గుడ్డ పేలికలూ తప్ప మరేమీ లేవు. మట్టి పొయ్యికి రెండు మూడు రోజులుగా వేడి సోకిన ఆనవాలేమీ లేదు. పాత బొంతపైన ముడుచుకుని పడుకున్న పదేళ్ల మద్దులేటి బిక్కమొహం పెట్టుకుని చూస్తున్నాడు.

పాత కొబ్బరి చిప్పలోంచీ ఆముదం తీసి ముద్దయ్య వీపుపైన తగిలిన దెబ్బలకు రాస్తూ ''నీకీ బుద్ధి వూరికే రాలే! యింటికీ పెంటకూ తెచ్చేదాంకే వచ్చింది'' అంటూ యేడుపును బిగనొక్కే ప్రయత్నం చేసింది సుబ్బమ్మ.

''ఛత్... నోర్మూయ్! అయిందానికీ కానిదానికీ బొరోమని యేడ్చేదానికి నేనేమీ గాజులేసుకోలే...'' మద్దయ్య విసుక్కున్నాడు. ''యీ పెద్దరెడ్డి వొక్కడు కూలీకి పిలవకంటే లోకమంతా గొడ్డు బోతాందా? రెక్కల కష్టపైన బతకతాండాము. వొకడికి బయపడి నడవాల్సిన గాచ్చారంలే. యీ పని లేకపోతే ముగ్గురాయిపని. అదీ లేకపోతే గుల్లగొట్టే పని...''

''నీకు చెప్పీ చెప్పీ నా నోరే పోతాంది. నీకీ దినం మళ్లా చెప్తాండాను'' సుబ్బమ్మ బొంగురుపోయిన గొంతుకతో చెప్పసాగింది. ''తొండాకిలు గుడ్లు బెట్టే ఆ రెండెకరాల చేను

మనకున్నా వాకిటే లేకపోయినా వాకిటే. యీ సుడిగాట్లో వానలూ వంగుడులూ వచ్చేలే. సేద్దం జేస్తే యిత్తనాల కాయలు గూడా దక్కే ఆశలే. యీ పక్కంతా నేలలో ముగ్గురాళ్లుండాయని పెద్దరెడ్డి కొనుగోలు చేస్తాండాడు గానీ లేకపోతే యీడెవురూ మూజ్జాడరు. అందరికీ యిచ్చేకంటే చానాగానే యిస్తాననీ అటాండాడు. చుట్టూ యింకో మడిసికి యిడిసిపెట్టకుండా నేలంతా జవురుకునేస్తాండాడు. మనమొకరం రెండెకరాల తోక మిగలబెట్టుకోని మిట్టనబడేది లేతీ! నా మాటిని వచ్చిందేందో తీసుకోని పెద్ద రెడ్డికే రాసిచ్చెయ్యి''

''నోర్ముయ్ సింపిరిము...'' మూర్చరోగి శరీరంలా మద్దయ్య వొళ్లు తుళ్లి పడసాగింది. ''వుండేది నోరులేని మొగబిడ్డలిద్దరు. మాయబ్బ నాకేమిచ్చి పోయినాడని అడిగితే తలెక్కడ పెట్టుకోమంటావే ధగ్గిడీ! మా తాతల కాలలం నించీ వస్తాండే నేల. పండేదో, పండందో, లెక్కవస్తాందో లేదో దాంతో నీకనావస్సం. దాపుగా తలా యెకరానేలుంటే బిడ్డలకెంత ధయిర్నం. నాలుగ్గింజలు జల్లితే, రొండు చినుకులు రాలితే, బిడ్డాబిసురూ తినేదానికి పిడికెడు పంట యింటికొస్తే ఆ మాత్రం సాలు నాకు. నా చేన్లో నష్టమే వచ్చినా నాకు కష్టంలే. మద్దెలో నాకిచ్చెయ్యమని అడిగేకి వాడెవుడు? యింతకింత యవహారం జరిపించినా కట్టు కదిలేదిలే. నా బిడ్డలకు దక్కాల్సిన నేల యిది. యెవురెట్ల యెగరేసకపోతారో నేన్జూస్తా!''

''యీ మాదిరి యితండంగా మాట్లాడి మిట్టూరికాడికి పొయ్యి గుల్ల పనిజేస్తివి. యేమేయింది? ఆ పక్కెందో దోపిడీ జరిగిత్తే నిన్నెత్తుకోని పొయ్యి నెల దినాలు పోలీసు టేషన్లో యేసి వూరికేనే రగత మొచ్చేట్లు కుళ్లబొడిసేసిరి. యిదంత యేల జరగతాందో నీకు తెలవాటంలే. నూర్లు మార్లుగా యెకరాలెకరాలుండే పెద్దోళ్లతో రచ్చలు పెట్టుకునేకి మన వల్లయితిందా? కొడుకుల మింద పెద్ద బ్రెముండే మడిసి మాదిరి నీలగతాండావు. యిదంతా తెలివైనోడు జేసే పన్లేనా చెప్పు?''

''పోలీసులంటే బయపడి చస్తాననుకుంటాండాడేమో పెద్దరెడ్డి...'' వాలిన శరీరాన్ని మరోవైపుకు తిప్పబోయి, తగిలిన చేయి నొప్పెట్టడంతో మూలుగుతూ అన్నాడు మద్దయ్య ''మిట్టూరు రోడ్డు పని జేసినప్పుడు నాలుగువేలు దాంకా మిగలబెట్టుకున్నెట్టు పోవిడీ దెలిసింది పెద్దరెడ్డికి. దాన్నెట్టయినా కొట్టెయ్యమని అందుర్నీ యెగదోలతాండాడు. సటపటంగా లొంగేదిలే. నెలదినాలు టేషన్లోనే పెట్టుకోని పోలీసులు మాత్రం కేసు పెట్నారా? యేమీ చెయ్యలేక యింటికే అంపించలా?...''

గుడిసె బయటినుంచీ నాలుగు కట్టెపేళ్లు తెచ్చి పొయ్యిలో మంట మండించే ప్రయత్నం చేస్తూ ''పదిరవై యెకరాలుండే కాపోల్లే యేలి ముద్రలెయ్యమన్న చోట యేసేసి, యిచ్చిన లెక్క దీసుకోని, దక్కిందాంతో సంతోషపడతాండారు. నువ్వే మాదిరిగా తల గొట్టినట్టుగా యెదురు తిరిగితే అంత పెద్దోడికి కోపం రాదా?'' అంటూ నిలదీసింది సుబ్బమ్మ.

''వూళ్లో అందురికీ ఆకేనేరు చెరువు పక్కన పెంకులిండ్లు కట్టిస్తానని చెప్తాండాడు గదా పెద్దరెడ్డి. మొన్నెప్పుడో అయిదారిండ్లకు కడగాలు గూడా యేసినారని అందురూ

అంటాండారు. మనం గూడ మంచిగా వుంటే మనకూ వొకిల్లు యిస్చాడు. పనికిరాని పౌరుషానికి పొయ్యి అంతా నష్టమే. తలకెత్తుకుంటాండావు. పెండ్లాం బిడ్డల మేలు జూసే మొగోడెవుడైనా యీ పని జేస్చాడా?...''

నీరసంతో మూసుకుపోతున్న కనురెప్పల్ని బలవంతంగా తెరిచి ''పెద్దరెడ్డి యేరవ నీకు తెలీలే!'' అంటూ వుూలగసాగాడు మద్దయ్య. ''ముగ్గురాల ప్లేట్లు యీ పక్కంతా వుండాయి. మన యింట్ల కాడ కూడా నేల పెళ్లగించి పారేయాలని మనల్ని వూరిడిసి పెట్టి పొమ్మంటాండాడు. కూలీ నాలీ జేసుకోని మిగలబెట్టుకున్న లెక్కతో బండీ యెద్దులూ బేరం జేసినానని కండ్లల్లో నిప్పులు బోసుకుంటాండాడు. వూర్లో యెవురూ బండి బాడిగకు పిలవకుండా అడ్డం పడతాండాడు. సిద్దాటం కాయల్ని బేరం జేసి రాజంపేటకు తోలుకొని పోతే మండీలోల్లకంతా పోన్లు జేసీ యెవుర్నీ బేరం జెయ్యనీలే! బస్టాండు కాడ నేనే అమ్మకం జేస్తి. సరుకుబండ్ల కొందికీ దిగి రేటు పడిపోయిందిగానీ లేకపోయింటే యిన్నూరు దాంకా మిగిలుండు. నాలుగు చినుకులు రాలి, రొండు దినాల దాంకా కాయల బండిపైన్నే వుండి సగానికి సగం కుళ్లిపోయినాయి. లేకపోయుంటే పెట్టిన లెక్కలో సగమయినా దక్కుండు. నాకంతా తెలస్చాందిలే! బండి వూరికే యిరిగిపోతిందా? యెవుడో మాదర్చేద్ కట్టెచీల తీసేసింటాడు. లేకపోయింటే ఆ మాదిరిగా బండిరిసు వొంగిపోదు. బండితో గూడా నేను గూడా యేడయినా గుంతలో పడి కాళ్లిరగ గొట్టుకుంటానని అనుకున్నాడు. నేనంత తేలిగ్గా యిడిసి పెడతానా బాంచెత్...''

పొగచూరిన పాత మట్టి పాత్రనొకదాన్ని పొయ్యి మీదికెక్కించి, దాని నిండా నీళ్లు పోసి, పొగచుట్టుకుంటున్న కట్టెల్ని రగిలించడం కోసం వూదుబుర్రతో గాలి వూదుతూ ''యిక్కన పక్కనోళ్లంతా మన మాలోల్లకు యవసాయం అచ్చిరాదని చెవల్లో జోరీగల మాదిరి గీపెడతాండారు. కాపోల్లతో మంచిగా వుండి, వాళ్లిచ్చే దాంతో జీవనం గడపాల్సి నోళ్లం. వాళ్లతో యిరోదం మంచిది గాదు...'' అంది సుబ్బమ్మ.

''పొరంబోకు నాయాళ్లంతా తెలివి లేకుండా యెగజూసుకోండారు గాబట్టి నిన్న మొన్న దాంకా రైతుల యెనకాల చేతులు గట్టుకోని తిరిగినోడు దడీల్మని పెద్ద రెడ్డయిపోయె. యీ పక్క నేలల్లోంతా ముగ్గురాళ్లుండాయని తెలుసుకోని, గవర్మెంటోళ్ల కాళ్లు పట్టుకోని, దొరికిన నేలంతా సాధీనం చేసుకుంటాంటే యెవుడైనా కుయ్‌కయ్‌మనినారా? వొక మడిసికి, వొక కుటుంబరానికి యెంత లెక్క గావాల్ల? వానికేమో వూరోళ్ల నేలంతా చాల్లే. నాకు రొంత భూముంటే వొప్పేలే. యిదేం నాయం? పెద్ద రైతులు చెరువు దగ్గిరా, కీనేరు బాయిల దగ్గిరా యవసాయం చేసుకుంటాండారు. కొండ కింద యెవురికీ కాబట్టన నేల తొక్కితొసికీ, దున్నీ గిన్నీ, రాళ్లూ రప్పలూ పగలగొట్టి సదును జేసి, యేందో యీ కాలానికి వొక మాదిరిగా తీర్చిండాను. అది కూడా నాకు దక్కగూడదని ముంత పొగ పెట్టేటోన్ని వూరికే యిడిసి పెడతానా?...'' పొయ్యి పక్కనున్న పాత ట్రంకు పెట్టెను గమనించి కాస్సేపు మాట్లాడటం ఆపి, ఆ తర్వాత ''పెద్దోడొచ్చినాడా?'' అని అడిగాడు మద్దయ్య.

కుండ అడుగులో మిగలిన బియ్యాన్ని చాటలోకి వూడ్చిపోసుకుంటూ వచ్చాడన్నట్టుగా తల వూపిందామె.

''పరీక్షలయిపోయినాయంటావా?'' ప్రశ్నించాడతను.

''బో పరీక్షలు. బాగా సదువు రాలేదని అపించేసినారు. యింక సదువూ లేదు యేమీ లేదు తీ...'' మూతి ముడుచుకుంది ఆమె.

''అదెట్ల అంపించేస్తారు? గవర్మెంటు ఆస్టల్లో పరీక్షలయిపోయిందాంకా అంపించే రూలులే! పెద్దరెడ్డి ఆ వార్డేనుతో గూడా యేమయినా చెప్పింటాడు....''

మద్దయ్య అతి కష్టంపైన లేచి నిల్చున్నాడు. మోకాలిపైన కట్టిన కట్టులోంచీ గడ్డకట్టిన రక్తం రబ్బరులా పలచగా సాగింది. మాసిన పంచ తప్ప మరో ఆచ్ఛాదన లేని అతడి నల్లటి శరీరం కమిలిన గాయాలతో సగం కాలిన కొరివి కట్టెలాగుంది. గుడిసె బయట పందిరి కింద పడుకుని నెమరేస్తున్న యెద్దుల దగ్గరికొచ్చి నిల్చున్నాడతను. డొక్కలు బయటపడి సన్నగా బలహీనంగా కనిపిస్తున్న యెద్దులు రెండూ యింకా మూలుగుతూ జాలి చూపుల్ని సారిస్తున్నాయి. వాటి కాళ్ల మడతల్లో రాసిన ఆకు పసరులోంచీ యింకా రక్తపు చుక్కలు రాలుతూనే వున్నాయి. మద్దయ్య కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ''ఆ ఆచారి దగ్గరికి యిరిగిన బండిని చేర్పించే దాంకే మిగిలిన లెక్కంతా అయిపోయింది. యింక దాన్ని అరువు చేసే దాంకి యెంతగావాల్నో!'' అని గొణుక్కుంటూ గుమ్మం దగ్గరికెళ్లి ''చిన్నోడ్ని అంపించి పెద్దోణ్ణి తొడుక్కోని రమ్మని చెప్పు. ఆ వార్డేను సంగతేందో తెల్సుకుందాం. నేనట్ల చేనుదాంకా పోయొస్పా. నిన్న రొంత తుంపర రాలింది. దున్న కానికి సరిపోతిందో లేదో సూసొస్పా...'' అంటూ మాట్లాడుతూనే రోడ్డు పైకెళ్లిపోయాడు.

వోబులేసు కోసం వూరిలోని ప్రతి యిల్లూ తిరిగి చూశాడు మద్దులేటి. రచ్చబండ దగ్గరికెళ్లాడు. పాడుబడ్డ మిల్లు దగ్గర వెతికాడు. కూలిన సత్రం గోడల దగ్గర గమనించాడు. దాదాపు రెండు మూడు గంటల ప్రయత్నం తర్వాత యెండిన చెరువు పక్కన, వాడిన చెరుకు తోట మధ్యలో గెనిమల మధ్య వొదిగి వొదిగి కూర్చుని తన యీడు పిల్లలతో పేకాడుకుంటూ కనిపించాడు వోబులేసు.

''యేంలే! యీతావు గూడా కనిపెట్టేస్నివా? పద పద. నేనూ వస్పాండాను యెనకాల్నే!'' అంటూ కసురుకున్నాడు వోబులేసు.

వొంటరిగానే వెనుదిరిగి వచ్చిన మద్దులేటి. తమ యింటి ముందు గుమికూడిన జనాన్ని చూడగానే బెంబేలు పడిపోయాడు. తుడుముపైన తోలు పట్టాతో బాదినట్టుగా గుండె డబడబలాడసాగింది. బెరుకు బెరుకుగా యింటి దగ్గరికొచ్చి ముంగిట్లో నిల్చున్నాడు.

పూర్తిగా గుడ్డ చుట్టిన పొడవాటి శరీరం ముందు సుబ్బమ్మ గుండెలవిసేలా యేడుస్తోంది.

''యీ ముగ్గురాయి తొవ్వేపనికి యీ మాదిరి నాట్లు పనికిరావు. మనవల్లా యిది అయ్యే పని గాదని చెప్తాండానే వుండాను. యినకండా నాట్లు పెట్టేకి పోయినాడు...'' శరీరాన్ని మోసుకొచ్చిన వాళ్లలోంచీ వొకతను చెబుతున్నాడు. ''కొండరాయి మాదిరిగా

వొళ్లంతా పిచ్చలు పిచ్చలయిపోయింది. ఆ గోరం యేల చెప్తావులే! చూడనోడు. పున్నాతుమ్మడు. యెవురికి వాళ్లు బెదిరిపోయి వచ్చేస్పావుంటే పెద్దరెడ్డి గదువుకోని మనుషుల్ని అంపించినాడు. చిల్లాపల్లాలయిన కాయాన్ని వొకచోట జేర్చి మూటగట్టి తెస్పొండాము. యిదంతా తెలిసి పోలీసు కేసయితే దానం జేసేకి పీనిగ్గూడా దొరకదు. కేసూ గీసూ గాకుండా చూసుకుంటానని పెద్దరెడ్డి జెప్పినాడు. దానం జేసేకి లెక్కిచ్చినాడు...''

వాళ్ల మాటలేవీ వినబడనట్టుగా సుబ్బమ్మ యేడుస్తూనే వుంది. మద్దులేటికి చెప్పలేనంత దుఃఖం వచ్చింది.

***

పాత లారీ వొకటి రోడ్లమీద కాంతి దుప్పటిని పరచుకుంటూ పరిగెడుతోంది. తెల్లటి మేఘమొకటి సముద్రంకేసి పరతెంచి పోతూ వుండటంతో ఆకాశంలోని చంద్రవంక తన అస్తిత్వాన్ని పోగొట్టుకుంది. దూరంగా పెద్ద భవనాలపైన నిరంతరాయంగా వెలుగుతున్న రంగురంగుల హోర్డింగులు పల్చటి మంచు తెరల్లోంచీ జిలుగు జిలుగు కాంతుల్తో ముద్దముద్దగా కనిపిస్తున్నాయి.

యెటువంటి పరిస్థితిలోనూ యిద్దరు వ్యక్తులు వొక్కసారిగా లోనికెళ్లడానికి వీల్లేకుండా కట్టిన సన్నటి అంబసీ గేటు దగ్గరినుంచీ క్యూ మొదలై వుంది. వీసా దొరకగానే యిటే పరదేశానికి వెళ్లిపోవడానికి సన్నద్ధమైనట్టున్న పెద్ద పెద్ద సూట్‌కేసుల పక్కన మూటల్లాగే వుండచుట్టుకుపోయి కనిపిస్తున్నారు అయిదారుమంది వ్యక్తులు. వారిపక్కన రకరకాల శాలువల్ని ముదరజుట్టుకుని కూర్చున్న సముదాయంలో స్త్రీలెవరో, పురుషులెవరో కనిపెట్టడం కుదరడం లేదు. షిఫ్ట్ డ్యూటీల్లా వంతులవారీగా క్యూలో కూర్చుంటున్న వ్యక్తుల ముఖాలు రాత్రి కడిగిపెట్టిన స్టీలుగిన్నెల్లా వెలిగిపోతున్నాయి. తమ చోటు జారిపోనివ్వకుండా శరీరంలోని యేదో వొక భాగాన్ని క్యూలోకి బదలాయించి పేవ్‌మెంట్ పైన యింకా కొందరు నిద్రతో విన్యాసాలు చేస్తున్నారు. పదిహేను యిరవైనుంచీ అరవై వరకూ వాళ్ల వయస్సు యెంతయినా వుండొచ్చు. కొందరు తమకు మారుగా తమ వస్తువుల్ని వుంచి దూరంగా వెళ్లి నిల్చుని మాట్లాడుకుంటూ వుండటంతో అక్కడక్కడా ఖాళీ పడిపోయిన క్యూ, అంబసీ అనే లంబాడీ పిల్ల మెడలోంచీ ముక్కలు ముక్కలుగా తెగి పడిన గుండు పూసల దండలా విలక్షణంగా కనిపిస్తోంది.

మద్దులేటి తన చోటికి తిరిగొచ్చేసరికి టీ షర్టు కుర్రాడి పక్కన యిదివరకటి కుర్రాడికి బదులుగా కొంచెం ముదురు వయస్సున్న యువకుడూ, అతడికంటే వొకటి రెండేళ్లు చిన్నదిగా అనిపిస్తున్న యువతీ కనిపించారు. యేడెనిమిది జేబులున్న బొమ్మల లూజు చొక్కాను నీలిరంగు జీన్సు పాంటులో టక్ చేసుకున్న ఆ యువకుడి నిగనిగల యెర్రటి శరీరంలో అందమైన ఫ్రేమున్న కళ్లజోడూ, కొనదేలిన ముక్కుకింది నల్లటి మీసమూ కేంద్ర బిందువుల్లా కనిపిస్తున్నాయి. గోధుమరంగు పంజాబీ డ్రస్సులో సన్నగా పొడుగ్గా యెర్రగా ఆరోగ్యంగా వున్న ఆ యువతి ప్రతిరోజూ చేస్తున్న పనినే మళ్లీ చేస్తున్నంత

యథాలాపంగా పేవ్‌మెంటుపైన కూర్చొని వుంది.

ఆమె చేతుల్లోని ఫైలు తీసుకొని, వొకసారి తిప్పిచూసి ''యెమ్‌సియ్యే సర్టిఫికెట్టు తీసుకరాలేదా?'' అని అడిగాడతను.

''రిజల్సు అఫీషియల్‌గా డిక్లేర్ చెయ్యలేదు. వచ్చేవారంలోగానీ యిష్యూ చెయ్యరు'' పారదర్శకమైన అద్దంలోంచీ దూరంగా వున్న వస్తువును దేన్నో చూస్తున్నట్టుగా అతడి ముఖంలోకి చూస్తూ చెప్పింది ఆవిడ.

అయిదారు నిమిషాల తర్వాత ''నెయిల్స్‌కా గ్రే కలర్ బాగా లేదు. రోజ్‌కలర్ ట్రయ్ చెయ్యి'' అన్నాడతను.

అరిచేతుల తమరల్లో ముఖాన్ని దాచుకున్న ఆ అమ్మాయి రెండు నిమిషాల తర్వాత ''రేపు ట్రయ్ చేస్తాను'' అంది.

తన జేబులోంచీ ఫోటోను అతికించిన చిన్న కార్డును పైకి తీసి ఆమె చేతికిచ్చాడతను. ఆమె వోసారి, దాన్ని అటూ యిటూ తిప్పి చూసి ''ఫోన్ నెంబరు నోట్ చెయ్యలేదే?'' అని అడిగింది.

''అది సీక్రెట్. కాన్ఫిడెన్షియల్'' అన్నాడతను.

యింతలో నల్లటి మోటారుబైకొకటి రెండడుగుల దూరంలో ఆగింది. దాని వెనక కూర్చున్న కుర్రాడు కిందికి దిగి ''ఐ విల్ వెయిట్ హియర్... యూ కెన్ గో...'' అంటున్నాడు క్యూలోని వ్యక్తితో.

''హలో మూర్తీ... హౌ ఆర్ యూ...'' మిలమిల మెరుస్తున్న చూపుల్తో బొమ్మల చొక్కా యువకుడు వుత్సాహంతో మోటారుబైకు దగ్గరికి నడిచాడు.

పక్కన్న కూర్చున్న అమ్మాయిని నేరుగా చూడగల అవకాశం దొరకడంతో మద్దులేటీ, టీ షర్టు కుర్రాడూ పక్కచూపుల్ని చూస్తూ అప్పుడప్పుడూ మోటారు బైకును కూడా పరామర్శించసాగారు.

''హాయ్ శీనూ! యెప్పుడొచ్చినా విండియాకు?'' మూర్తి పలకరించాడు.

''టూ వీక్సయింది. వచ్చే టెన్తే మళ్లీ వెళ్లిపోవాలి. బైదీబై, షీ యీజ్ మై ఫియాన్సీ నీలిమ...''

''హలో! ప్లీస్ టు మీట్ యూ'' అంటూ ఆమెను పలకరించాక మూర్తి ''నేనిప్పుడు యిక్కడ్నే మదరాసులో వొక ప్రయివేటు ఫర్మ్‌లో వుండాను. యేడు వేలు పే జేస్తారు. యింకో రెండేళ్లు పోతే కన్సిడరబుల్‌గా పెంచతానని ప్రామిస్ చేస్తావుండాడు యెండీ. కానీ నాకీ అట్మాస్ఫియర్ పడలేదు శీనూ! వన్ ఆఫ్ మై కజిన్స్ యీజ్ దేర్ యిన్ షార్జా... వచ్చేయుమంటా వుండాడు. వచ్చే సమత్సరంలో వెళ్లిపోదామనుకుంటా వుండాను'' అన్నాడు.

''స్టేట్స్‌కు ట్రయ్ చేయగూడదా?'' అంటూ అడ్డుతగిలాడు శీనూ.

అతనోసారి వులిక్కిపడ్డట్టుగా తల పైకెత్తి ''ఐ డోంట్ హేవ్ సచ్చేన్ అయిడియా! మా నెవ్వ్యూ వీసా కోసరం ట్రయ్ చేస్తా వుండాడు. యిక్కడ వదిలిపెట్టమంటే వచ్చినాను. కొంచెం అర్జెంటు పనుండాది. పోతాను...'' అంటూ మాట్లాడుతూనే వాహనాన్ని డబడబలాడించి ముందుకు దూసుకెళ్లిపోయాడు.

శీనూ మళ్లీ తన చోటుకొచ్చి కూర్చుంటూ ''యెంత జెలసీనో చూసినావా? వీడు యింటర్లో నాకు బెంచ్ మేటు'' అన్నాడు అటువైపే చూస్తూ.

ముందుకే చూస్తూ తలవూపింది నీలిమ.

''స్టేట్స్‌లో యే యూనివర్శిటీలో వుండారు సార్ మీరు?'' కుతూహలాన్ని ఆపుకోలేక అడిగాడు టీషర్టు కుర్రాడు.

''రీసెర్చి కాదండీ! జాబ్ చేస్తావున్నాను. యిల్లినోయిస్‌లో కంప్యూటర్ కన్సల్టెన్సీలో జాబ్... యెంటెక్ చేసింది గూడా ఆడ్నే! నెక్స్ట్ యియర్లో గ్రీన్‌కార్డు కూడా వస్తింది...'' యింతసేపటికి సరైన శ్రోత దొరకడంతో శీనూ కూడా వుత్సాహంగా సమాధానం చెప్పాడు.

''పెళ్లి కాకుండానే ఆమెకూ వీసా యిస్తారా సార్ వీళ్లు?'' టీషర్టు కుర్రాడికి మరో అనుమానం వచ్చింది.

శీనూ రహస్యం చెబుతున్నట్టుగా అతడికేసి వొంగి ''నిజానికి మా పెండ్లి జరగబొయ్యేది యెల్లుండి. తిరపతిలో పెండ్లి. మా బ్రదరూ, వాళ్ల బ్రదరూ ఆ పనుల్తో బిజీగా వున్నారు. పోయినసారి యిండియాకు వచ్చినప్పుడే రిజిస్ట్రరాఫీసులో పెండ్లి రిజిస్టరు చెయ్యించినాము. ఆ ఫార్మాలిటీస్ అయిపోయినట్టు ఫారాలు సబ్మిట్ చేస్తేనే యిక్కడ వీసా యిస్తారు...'' అన్నాడు.

కాస్సేపటిదాకా నిర్ఘాంతపడిపోయిన మద్దులేటి బలవంతంగా గొంతు పెగుల్చుకుని ''అయితే మీకిప్పుడు పెళ్లయినట్టా కానట్టా సారూ?'' అని అడిగాడు.

అతని ప్రశ్నని వినిపించుకోకుండా నీలిమ కేసి తిరిగి ''పాపం యీ పెళ్లి హడావుడంతా మీ అన్న నెత్తిపైన్నే పడింది. హీ యీజ్ రియల్లీ యెఫిషియంట్. వేరే యింకొకరయితే తట్టుకోనుండరు. జాతకాలు చూపించే కాడినుంచీ అన్ని పనులూ వొక చేత్తో చేసుకుని పోతా వుండాడాయన. యూ ఆర్ రియల్లీ పార్చునేట్ టూ హేవ్ సచ్చే బ్రదర్'' అంటూ దూరంగా స్టీలు ఫ్లాస్కులో కాఫీ తీసుకొస్తున్న వ్యక్తిని చూడగానే ''కాఫీ తాగుదామా!'' అని అడిగాడు శీనూ.

తాగకెక్కడికి పోతారన్నంత ధీమాతో ఫ్లాస్కును క్యూ మొదటికి తీసుకెళ్లి ప్రతి వొక్కరికీ అడగకపోయినా ప్లాస్టిక్ కప్పులతో కాఫీనందిస్తూ రాసాగాడు కాఫీవాలా.

జెమినీ సర్కిల్ చుట్టూ రోడ్లపైన రకరకాల వాహనాల సంరంభం క్రమంగా పెరిగిపోతోంది. పేవ్‌మెంట్లపైన పాదచారులు కూడా కనిపిస్తున్నారు. దూరంగా తూర్పుదిశలో భవనాల కవతలినుంచీ లేలేత కిరణాలతో యెండల వలనల్లుకుంటూ ఆకాశంపై కెగబాకుతున్నాడు సూర్యుడు. రాత్రల్లా కప్పుకున్న శాలువాల్లోంచీ, ముఖాల్ని బయటదీసి

చలిగాచుకుంటున్నవాళ్లు కాబేజీ పువ్వుల్లా బిడియంగా కనిపిస్తున్నారు. చలిగాలిని రేపుతూ వాహనమేదయినా రోడ్డుపైన దౌడు తీసినప్పుడల్లా మరింతగా ముడుచుకుపోతున్నారు. పసుపురంగు నీటి యేనుగులాంటి ఆటో వొకటి గీపెట్టుకుంటూ వచ్చి ఆగింది. అందులోంచీ యెర్రగా లావుగా పొడుగ్గా వున్న యువకుడూ, సన్నగా పొట్టిగా వున్న యువతీ దిగారు. అంతవరకు మధ్యలేటికి అయిదారుమంది కవతల ముసుగు కప్పుకొని కూర్చుని వున్న ఆకారం పొడవాటి గుమ్మటంలా పైకిలేచి ''యిక్కడ... యిక్కడ'' అంటూ కేకేసింది.

యింకా మగత నిద్రలో తూగుతున్నవాళ్లు యేదో జరిగిపోయిందనుకుంటూ వులిక్కిపడి కళ్లు తెరిచి చూడసాగారు.

''యిక్కడ... యిక్కడే... కమాన్ డియర్'' అంటూ ఆ యువకుడు ఆమె కేకకు ప్రతిధ్వనిలా కిళారిస్తూ తనతోబాటూ వచ్చిన యువతిని ఆహ్వానించాడు.

''కమాన్ సుష్మా... నువ్విలా కూర్చో! నేనిలా కూర్చుంటాన్లే! రేయ్ బాబీ! అక్కడ కాఫీలేవో అమ్ముతున్నట్టున్నారు. వెళ్లి మీ ఆవిడకో కప్పు తెచ్చిపెట్టు'' అంది లావాటి ఆవిడ.

''వియ్ హేవ్ ఆల్రెడీ హేడ్ యిట్. బాబీ వెళ్లి మీ అక్కయ్యకు కాఫీ తెచ్చివ్వు. పాపం, మన కోసం రాత్రినుంచీ యీ క్యూలో వెయిట్ చేసుంటారు...'' అంది సుష్మ.

''అవునమ్మాయ్! నిన్న మీ ఫోన్ వచ్చిన వెంటనే బయల్దేరి సాయంకాలానికల్లా మద్రాసు కొచ్చేశాను. భోంచేసి నేరుగా యిక్కడికొచ్చేశా. అప్పటికే యింత పొడవుంది క్యూ...'' అంది ఆవిడ.

''సారీ ఫర్ ది ట్రబుల్ వదినా! అంతా హర్రీ బర్రీ అయిపోయింది. లేకుంటే నీకీ పని పెట్టకపోదును...'' క్యూ వైపు పరకాయించి చూస్తూ అంది సుష్మ.

''యిటీజె ప్లెజర్ సుష్మా! మా బాబీ అమెరికా ట్రిప్పుకు నేనామాత్రం కష్టపడగూడదా అమ్మాయ్...'' ఆవిడ అనవసరంగా రొప్పుతోంది.

''మేం మెడ్రాసుకొచ్చేసరికి అర్ధరాత్రయిపోయింది. హోటల్లో రూం తీసుకుని కాస్సేపు రెస్ట్ తీసుకున్నాం. తర్వాత పేపర్సన్నీ సర్దుకుని వచ్చేశాం'' అంటూ తన సోదరికి వర్తమానం అందించి ''డూ యూ నో సుష్మా! మన మేచ్ ఫిక్స్ కావాడానికంతా మా అక్కయ్యే కారణం. అసలు నన్నెలాగైనా అమెరికాకు పంపాలని అక్కయ్య పట్టుదల...'' అని బిగ్గరగా అరుస్తూ చెప్పసాగాడు బాబీ. ''పీహెచ్డీ చేసి యూనివర్శిటీలో జాబ్ వచ్చినా తనెందుకింకా మేరేజ్ చేసుకోలేదనుకున్నావ్? న్యాయానికి మా అక్కయ్యకు పెళ్లికాకుండా నేను పెళ్లి చేసుకుని వుండకూడదు. కానీ గ్రీన్‌కార్డున్న వాడ్ని తప్ప యింకో మనిషి చాయకైనా చూడనంది. యెంతకూ సరైన మేచ్ ధొరకలేదు. నేనేమో మెడిసిన్ చదివాను. నాకయితే మంచి అలయెన్సు దొరకచ్చని యెవరో సలహా యిచ్చారట తనకి. తానే పట్టుబట్టి, పూనాలో వాళ్ల ఫ్రెండిచ్చిన అడ్రస్సు పట్టుకుని, అమెరికాలో వున్న తెలిసినవాళ్ల

ద్వారా కదిపించి, ఫాక్స్‌లూ, కేబుల్సూ పంపించి, చివరికి మీరు యిండియాకొస్తున్నట్టు కనిపెట్టి, మాచ్ కుదిరేదాకా రెస్టులేకుండా తిరిగింది...''

''వీడు నీకసలు అసలు సంగతి చెప్పడం లేదమ్మాయ్!'' ఆవిడ మరింతగా గడబిడ చేస్తూ ఆ అమ్మాయిని లాగి తన పక్కన కూచోబెట్టుకుంది. ''నువ్వెళ్లి అమ్మాయిని చూసి వోకే అంటే చాలు అంటాడు గానీ కదలడే వీడు! అమ్మాయి వాళ్లకు గ్రీన్‌కార్డుంది. వోహియోలో సెటిలయిపోయారు. యిక ప్రత్యేకంగా చూడాల్సిన అవసరం లేదంటాడు. నాకు పరీక్షలున్నాయి. మీరెళ్లి వోకే చేస్తే నేనొచ్చి మంగళసూత్రం కడతానంటాడు. వీడొట్టి అమాయకుడు. కాకపోతే గ్రీన్‌కార్డున్న పెళ్లికూతురు దొరికాక యీ యెండీ పరీక్షలూ గట్రా యే గంగలో దూకితే యేం పోయింది చెప్పు? స్టేట్స్‌కెళ్లాక వీడి ఛాయ నో కన్నేసి వుండాలమ్మాయ్ నువ్వు''

రెండు చేతులతోనూ రెండు కాఫీ కప్పులు పట్టుకుని వస్తూ ''మా అక్కయ్య మాటలు కాస్త జాగ్రత్తగా వినాలి సుష్మా! నన్ను జాగ్రత్తగా చూసుకోవడమంటే నా బాధ్యతల్ని మరచిపోవద్దూ అని అర్థం. అంటే యేమిటి? గ్రీన్‌కార్డున్న అమెరికా సిటిజన్ని మా అక్కయ్య కోసం వెదికిపెట్టాలి. యీజిట్ నాట్ అవర్ ఫస్ట్ డ్యూటీ...'' అన్నాడు బాబీ.

కళ్లార్పడం సైతం మరచిపోయి అక్కాతమ్ముళ్ల నిద్దరినీ మార్చి మార్చి చూడసాగింది సుష్మ.

***

''యీ అయిదారేండ్లుగా నేనెంతో మందిని పట్టిపట్టి చూసింటాను. కానీ మీ అన్న మాదిరి మనిషినెప్పుడూ చూల్లే!'' అన్నాడు లాయర్ రంగనాయకులు.

భగభగ మండుతున్న యెండలో డిస్ట్రిక్ట్ మున్సిఫ్ కోర్టు భవనాల సముదాయం మినమినా మెరుస్తోంది. అనుమతిలేని ప్రదేశంలోకి జొరబడి రెడ్‌హాండెడ్‌గా పట్టుబడిపోయిన ముద్దాయిల్లా ప్రహరీగోడ కివతల నాల్గైదు చెట్లు తలలొంచుకుని నిల్చుని వున్నాయి. చుట్టూ యెటుచూసినా జనమే! నలుపురంగు దుస్తులు తొడుక్కున్న లాయర్లు అన్ని భవనాల్లోనూ వొకేసారి పని బడినట్టుగా గిరికీలు తిరుగుతున్నారు.

యెండను జల్లెడబెడుతున్న వెదురు తడికల క్యాంటీనులో గుంపులు గుంపులుగా కూర్చున్న వ్యక్తులు యెవరి ధోరణిలో వాళ్ల మంతనాలు జరుపుతున్నారు.

వుక్కపోతను సరకు చేయునట్టుగా నల్లకోటుపైన నల్లగౌను కూడా తొడుక్కుని, పొడవాటి సిగరెట్టుకు తోడుగా వేడివేడి టీ గ్లాసును చేతబట్టుకుని ''దీనికోసరం తిరపతి నించీ పరిగెత్తుకొనొస్తివా? యీడ మేమంతా లేమా అబ్బీ!'' అన్నాడు రంగనాయకులు.

తానూ టీ చప్పరిస్తూ ''కేసెప్పుడు పెట్టినారు సార్?'' అని అడిగాడు మద్దులేటి.

యిప్పుడిప్పుడే తెల్లబారుతున్న మీసాల కొసల్లో పాటమరించిన చెమటబిందువుల్ని ముంజేయితో తుడుచుకుంటూ ''పేపర్లో గూడా యేసినారు చూల్లేదా నువ్వు?'' అంటూ

కళ్లజోడులోంచీ చికిలి చూపుల్ని ప్రసారం చేశాడు రంగనాయకులు.

మద్దులేటి బిక్కమొహం పెట్టాడు.

''కొత్తూరు కాడ జరిగిన అంటెంట్టు. చిన్నరెడ్డి జీపులో కడపకు పోతాండాడు. చిన్నరెడ్డి వూరిడిసిపెట్టి టవునుకు పొయ్యేదంటే చిన్న పని గాదని తెలుసుగదా! ముందుగా ఆయిన జీపెక్కి డ్రయివరు పక్కన కూర్చున్నాడు. ఆయన పక్కన యిద్దరు గన్‌మేన్లు కూచ్చున్నారు. యెనకసీట్లో నలుగురు కూర్చున్నారు. మామ్మూలుగా అయితే ముందొక జీపూ యెనకాలొక జీపూ ప్రొటక్షనుంటాయి. ఆ పొద్దెందుకో కొంచుం యేమారినారు. సరింగా కొత్తూరు దాంటి రెండు ఫర్లాంగులొచ్చినాంక యెంటబడింది వాళ్ల జీపు. దాంట్లో అయిదారువంది గన్‌మేన్లుండారని డ్రయివరు కనిపెట్టేసినాడు. అటాక్ జేస్పేవాళ్లదే పైచెయ్యని తెల్సుకునేసినాడు. వోవర్‌స్పీడ్‌లో జీపును తోలినాడు. వాళ్ల జీపు గూడా స్పీడెస్పేసింది. చుట్టుపక్కల పల్లెల్లో వుండేటోళ్లు గూడా రోడ్డుపైన జీపు లొకదాన్నొకటి తరుముకుంటాండేది చూసి కిల్లరక పాయినారు. వొంటిల్లుకు మైలు దూరంలో యెద్దల బండినొకదాన్ని కొట్టేసినాడు మనోడు. రెండు యెద్దుల్లో వొకటి స్పాట్ డెడ్. బండి తోలినోడింకా ఆస్పత్రిలోనే వుండాడు. వాళ్ల గన్‌మెన్లు జీపులోంచే కాల్చినారు. యెనకాల గూర్చున్నోళ్లల్లో వొకడు స్పాట్ డెడ్. యిద్దరింకా ఆస్పత్రిలో వుండారు. యింత జరిగినా ఆ డ్రయివరు మాత్రం జీపాపినోడు గాదు. ఆపుంటే చిన్నరెడ్డికీ డేంజరే! మిట్టూరు క్రాసుకు రాంగనే డ్రయివరు తెలివిగా అడివి మార్గానికి రూటు మార్చేసినాడు. అదే రూట్‌లో కడపకొచ్చినాంక చిన్నరెడ్డి పోలీసు రిపోర్టిచ్చినాడు. సరింగా ఆ వుర్నాడే కడపకొస్తాండే యెగస్పార్టీవాళ్ల జీపుమింద మిట్టూరుకాడ బాంబులేసినారు. యిద్దరు స్పాట్ డెడ్...''

''వూ అన్నెప్పుడూ చిన్నరెడ్డిని నేరుగా కూడా జూసిండలే. యెగస్పార్టీవోళ్లతో మాట్లాడిందిలే! యింకెందుకు అరెస్టు చేసిండారు?''

''సమంధం లేదని నువ్వనుకుంటాండావు. జీబుమింద బాంబులేసింది నేనేనని మీ వోబులేసే వొప్పుకుంటాండాడు. దీనికీ చిన్నరెడ్డికీ సంబంధం లేదని క్లియర్‌కట్‌గా చెప్తాండాడు...''

''అయితే యీయెనెందుకు బాంబు లేసినాడంట?'' మద్దులేటికంతా అయోమయంగా తోచింది.

''వాళ్లెప్పుడో యెలక్షన్లప్పుడు వోబులేసును సావ సితగ్గొంటినారంటలే! మీ అన్న సరయిన టయిం కోసరం సమత్సరంగా కాపెట్టుకోండానని చెప్తాండాడు...''

''పోయిన తడవ కాలేజీకి పొయ్యేటప్పుడు యిన్నూర్రూపాయలడిగితే లేదనేసిశాడు. బాంబులు దెచ్చేకి మాత్రం లెక్కెక్కడ్నించీ వస్పాది?''

''యీ లా పాయింట్లు నాకు తెలియదనుకోవద్దు. యీ కొచ్చిన్నన్నీ ప్రొసీడింగ్సులోనే యెగ్జామిన్ చేసేసినాను. అన్నీ సెటిలయిపోయినాయి. యీ పొద్దో రేపో జడ్జిమెంటు

వచ్చేస్పాది...'' రెండు అడుగులు వేసినవాడల్లే ఆగి ''యిదో మద్దులేటీ! యేందో చదువుకుంటాండావనీ, జరిగిందేందో తెలవకుండా వచ్చినావనీ అడిగిందానికంతా నీ కర్థమయ్యేట్టుగా వివరంగా జెప్పినాను. యేందో చూసేసి పొయ్యే దానికొచ్చినావు. గొమ్మునా చూసుకోని పో. ఆ మాటా యీ మాటా చెప్పి వోబులేసు మాట మార్చేట్టుగా చేసినావే అనుకో. యెంత పబ్లిక్ ప్రాసిక్యూటరయినా నేనేమీ హెల్పు జెయ్యలేను. ఆ సంగతి మర్చిపోవద్దు...''

నల్లటి బండల బెంచీపైని గ్లాసులోని టీ యెప్పుడో చల్లారిపోయింది. రంగనాయకులు ఖాళీ చేసిన స్థలంలో నల్లగౌను తొడుక్కున్న లాయరింకొకతను కూర్చుని పక్కన నిల్చున్న వ్యక్తితో యేదో మాట్లాడుతున్నాడు. క్యాంటీను వెలుపల బీడీలు కాల్చుకుంటున్న పోలీసులిద్దరికీ తాము యెండలో నిల్చున్నామన్న స్పృహ వున్నట్టు కనిపించడం లేదు.

కొండరాళ్లు దొర్లించినట్టుగా పెద్దగా శబ్దంచేస్తూ మట్టిగొట్టుకుపోయిన జీబులు నాలుగు వొకదాని వెంట వొకటిగా కోర్టు ఆవరణలోకి వురకలెత్తుకొచ్చాయి. వాటిలోంచీ నలిగిన దుస్తులు తొడుక్కున్న మనుషులు కొందరు తుపాకీలు పట్టుకుని కిందికి దూకారు. కాస్సేపటి తర్వాత నింపాదిగా కిందికి దిగిన చలువ దుస్తుల మనుషులు తాపీగా కోర్టులోకి సాగిపోయారు.

మద్దులేటి ముందుకూర్చున్న లాయరు బిస్కట్టు తింటూ పక్కకు తిరిగి చూసి ''చిన్నరెడ్డొచ్చినట్టుండాడు'' అని మళ్లీ తన మాటల్లో పడిపోయాడు.

తానూ పైకిలేచి కోర్టులోకినడచాడు మద్దులేటి. వో గోడపక్కన వడిలిపోయిన మనుషులు నలుగురైదుగురి మధ్య వోబులేసు కనిపించాడు. అతడి గడ్డం పెరిగిపోయి వుంది. తల రేగిపోయి వుంది. చేతులకు బేడీలున్నాయి. అతడి దగ్గరికెళ్లి నిల్చుని ''మిట్టూరుదాంకా నువ్వెందుకు పొయినావా పొద్దు? అంత దూరం పొయ్యే పని నీకేమొచ్చింది?'' అని అడిగాడు మద్దులేటి.

వోబులేసు వులిక్కిపడి తల పైకెత్తి ''కొంచెం మెల్లింగా మాట్లాడు. నువ్వెందు కొచ్చినావీడికి?'' అన్నాడు కంగారుపడుతూ.

''అసల నీ మింద రిపోర్టెవురిచ్చినారు? దాన్ని పోలీసులెట్ట నమ్మినారు? సాక్షిమెవురు చెప్పినారు?'' కోపంతో మద్దులేటి గొంతు మరింత పెద్దగా వురిమింది.

వోబులేసు అటూ యిటూ పరీక్షించి చూసి, తోటి ముద్దాయిల నుంచీ నాలుగడుగులు ముందుకు నడిచి ''పెద్దగా అరవద్దు... యెవురైనా యిన్నారంటే రండయిపోతింది. నీకింకా వొయిసు రాలే. యిదంతా తెలవదు...'' అంటూ రహస్యం చెబుతున్నట్టుగా గొంతుక తగ్గించి చెప్పసాగాడు. ''మనదృష్టం బాగుండి నేనా పొద్దు మిట్టూరు కాడికి యెద్దల బేరానికి పొయున్నాను. డవుట్టుపడి పోలీసులు నా కాడికొచ్చినారు. కేసు విచారణయిపోయినాంక కొన్ని దినాలట్ల జైల్లో కాలం దోసినామంటే సాలు. యెట్నో వొకట్ల బయటికి లాగేస్తాడు చిన్నన్న. ఆయన సల్లంగా జూస్తే యింక భయంలే. చానా దినాలుగా రొంత నేల కొనాలని

పాకులాడతాండాను. చిన్నన్న తలచుకుంటే బంగారట్లా నేల మనదయిపోతింది. దాంట్లో చీనీ చెట్లు పెట్టేస్తే యిక దిగుల్లే! పిల్లకాయిలిద్దర్నీ ఆస్టల్లో జేర్పించి సదివిస్తాడు. పనిజేసినా చెయ్యకపోయినా గువుమస్తాలతో చెప్పి నెలనెలా టంచనుగా కూలీలెక్క యిప్పిస్తాడు. నీకేల, గొమ్ముని సూస్తాండు. నీ పరిక్షలయిపోంగానే యాడైనా వుద్దోగం యెయ్యిస్తాడు. యిట్ల నువ్వొచ్చి గలాటా జేసినావని తెలిస్తే, వొద్దువొద్దన్నా నన్ను బయటికంపించేస్తాడు. యీ మాత్రం బేడీలేసుకుని రెండు మూడేళ్ళు జైల్లో కాలం దోసేదాంకి కొల్లబోయినంతమంది వస్తారు...''

***

అంబసీ ముందు క్యూలో సూట్‌కేసుల పక్కన కూర్చున్న వ్యక్తులు కొందరు తాము సామాన్లలా పడివున్నారు. తోపుడు బండిపైన కొబ్బరి బోండాల్ని తీసుకొచ్చిన కుర్రాడు కొబ్బరి చిప్పల్ని సైతం విలువైన ఆస్తిలా ప్రోగు చేసుకుంటున్నాడు. కూల్‌డ్రింకులమ్మే అతను సీసాల పైన, వోపనీర్‌తో శబ్దం చేస్తూ నడుస్తున్నాడు. దూరంనుంచీ తోపుడు బండ్లల్లోంచీ ఆమ్లెట్ల వాసన దంచేస్తోంది.

విశాలమైన వెనకసీట్లో కూర్చున్న యజమానికి కోపమొస్తుందేమోనన్న భయంతో తెల్లటి పడవ కారొకటి నిశ్శబ్దంగా రోడ్డుపైన జారుతోంది. యినపరజనులో ముంచి తీసిన అయస్కాంతంలా చుట్టూ పోగులు పోగులుగా వేలాడుతున్న మనుషులతో ముసలి టౌను బస్సొకటి ముక్కుతూ మూల్గుతూ వెళ్తోంది.

సైకిలు స్టాండు నిండా యింగ్లీషు దినపత్రికల్ని తీసుకొచ్చిన కుర్రాడొకడు క్యూలోని వాళ్ళకందరికీ వుచితంగా వాటిని పంచసాగాడు. దినపత్రికకు క్లిప్ చేసిన ప్రకటన కాగితాన్ని చదువుతూనే ''చూశావా! యిది రాజా ట్రావిలర్స్ వాళ్ళిచ్చిన కాంప్లిమెంటరీ కాపీ! యే దేశానికైనా యెప్పుడైనా యే రకం టిక్కెట్టు కావాలన్నా నిమిషాల్లో యేర్పాటు చేస్తారట! యింతకూ దీని వోనరెవరో చూశావా నువ్వు!'' అంటూ అడిగాడు మద్దులేటికి యెడమ వైపున కూర్చున్న మూడో వ్యక్తి. అతని పక్కన కూర్చున్న ఆవిడ తెలియదన్నట్టుగా తలతిప్పింది. నలిగిన తెల్లటి దుస్తుల్లో అతను నిన్నటి దినపత్రికలా నిస్సారంగా కనిపిస్తున్నాడు. మడతలు నలిగీ నలగని వెంకటగిరి నేతచీరలో ఆవిడ రేపు పూర్తిగా విరియబోయే దిరిసెన పూవులాగుంది.

''మేనేజింగ్ పార్టనర్ ప్రతాపమౌళి అంటే యెవరో తెల్సా? రాజేంద్రమూర్తి కొడుకు. అదేనోయ్ సిన్మాయాక్టరు. ఆ మధ్య అదెవత్తో సిన్మాయాక్టరు ప్రేమలో పడి కనపడ్డం లేదని రూమరొచ్చింది చూడూ! వాడే వీడు. మొత్తానికి మూర్తి పెద్ద ప్రయోజకుడు. వోగైపోయిన కొడుకును వెతికిపట్టి వాన్నొక ప్రయోజకుడ్ని చేశాడు. ఆఫీసెక్కడో చూశావూ? స్పెన్సర్ టవర్సులో. అక్కడ పదీ యింటూ పది అడుగుల ఆఫీసుకే నెలకు పాతికవేల రూపాయల రెంటుంటుంది. అసలు ఆ ప్లేసు కొనేసే వుంటాడు మూర్తి. మహావుంటే పాతిక లక్షలయి వుంటుంది. అదొక లెక్కా మూర్తికి?''

''మీరిద్దరూ స్టేట్స్‌కేనా సార్'' అంటూ అడ్డు తగిలాడు శీనూ.

''లేదు మిస్టర్! నా మిసెస్‌ను పంపిస్తున్నాను'' అన్నాడతను.

''యే యేరియాకు సార్'' అంటూ అతణ్ణి మరింతగా ముగ్గులోకి దించాడు శీనూ.

''చికాగో! తెలుగు మహాసభలు జరుగుతున్నాయక్కడ. డెలిగేట్‌గా నా మిసెస్‌కు యిన్విటేషనొచ్చింది'' చెప్పడానికిష్టంలేని వ్యక్తిలా ముఖమదోలా పెట్టుకుని నెమ్మదిగా చెప్పాడతను.

అటువైపున కూర్చున్న నల్లటి గడ్డపు యువకుడు ''మహాసభలకేనా సార్! నేనూ అందుకే వచ్చానండీ! నాకూ వచ్చింది యిన్విటేషన్. నా పేరు రమణ్‌జీ. మాది వైజాగ్... మీరు'' అంటూ అతడి చేతుల్ని పట్టుకుని వూపేశాడు.

మరింతగా మొహమాట పడిపోతూ అతను ''అయామ్ సూర్యకుమార్. నా మిసెస్ పేరు శాంతాలక్ష్మి'' అన్నాడు.

ఆమెనోసారి పరకాయించి చూసి ''ఆమె సింగరాండీ'' అని అడిగాడు రమణ్‌జీ.

సూర్యకుమార్ మరింతగా ముఖం ముడుచుకుని ''కాదండీ! డాన్సరు. మీరేం చేస్తారు?'' అని సమాధానంతో బాటూ ప్రశ్నను కూడా సరఫరా చేశాడు.

రమణ్‌జీ ముసిముసి నవ్వులు నవ్వుతూ ''నేను పాటలు పాడుతానులెండి'' అన్నాడు.

''కర్నాటకా? వోకలా?'' మొదటిసారిగా శాంతాలక్ష్మి మౌనాన్ని విడిచిపెట్టింది.

''కాదు మేడమ్! లైట్ మ్యూజిక్. లలిత సంగీతం. మొన్ననే వచ్చింది పాస్‌పోర్టు. వీసా దొరికితే యివ్వాళే బయల్దేరేస్తాను. సార్ తోడు లేరని కంగారేం వద్దు, మీకు నేనుంటాను''

సూర్యకుమార్ అతడి మాటలేవీ వినబడనట్టుగా ''మీకొచ్చిన యిన్విటేషన్ అఫిషియల్ దేనా? యేదీ వోసారి చూపెట్టండి చూద్దాం'' అని అడిగాడు. తన ఫైలునంతా తిప్పి చూసి ''అరే! యిన్విటేషను మరచిపోయానే!'' అన్నాడు రమణ్‌జీ. అతడికి వినిపించకుండా భార్య చెవిలో యేదో గొణగసాగాడు సూర్యకుమార్.

అంబసీ గేటు ముందు కలకలం మొదలయింది. కీ యిచ్చినట్టుగా క్యూ బిగుసుకుంటూ రాసాగింది.

''యేడున్నర. సరిగ్గా టయానికే యింటర్వ్యూలు మొదలెట్టేశారే'' అన్నాడు రమణ్‌జీ.

రోడ్డుపైన యెర్రరంగు కారొకటి జారుతూ వచ్చి ఆగింది. అందులోంచీ పొడవుగా లావుగా వున్న శాల్తీ వొకటి కిందికి బదిలీ అయింది. అతడి సిల్కు జుబ్బా సూర్యకిరణాల్ని పరావర్తనం చేస్తోంది. పెద్ద అంచులున్న పంచా, అంగవస్త్రమూ సగానికి సగం నేలపైన జీరాడుతున్నాయి. తాంబూలంతో యెర్రనైన పెదవులు నుదుటిపైని కుంకమ బొట్లతో పోటీపడుతున్నాయి. బట్టతలని కప్పిపుచ్చడం కోసం అటూ యిటూ వాడతిప్పి అతికించిన వెంట్రుకలు మాడరన్ పెయింటింగ్‌ను తలపిస్తున్నాయి.

''ఆయనే సార్! అంతర్వేదుల సుబ్రమణ్యశాస్త్రి. మీకు పరిచయం లేదా?'' శీనూ

గాయకుడ్నీ, నర్తకినీ వొక్కసారిగా ప్రశ్నించాడు. యిద్దరూ తమని గానట్టుగా మౌనంగా వుండిపోయారు. సూర్యకుమార్ మాత్రం ''హైదరాబాద్‌లో కలిసినట్టున్నాను. పెద్ద గాయకుడు కదండీ!'' అన్నాడు.

''భలే వాళ్లే సార్ మీరు! ఆయన పెద్ద మృదంగం ప్లేయర్. యిరవై నాలుగ్గంటలూ మృదంగం వాయించి కంకణం తొడుక్కున్నాడు. గొప్ప భుజబలముండే మనిషి''

''సార్ సార్! ఆ కారులో దిగిందెవరో గుర్తుపట్టారా మీరు?'' శీనూ మాటలు పూర్తిచేయకమునుపే రమణ్‌జీ గొంతు చించుకున్నాడు.

మద్దులేటి కూడా వోసారి కారులోంచీ దిగిన అమ్మాయికేసి పరీక్షించి చూశాడు. సన్నగా పొడుగ్గా జిరాఫీలాంటి ఆకారం. బ్యూటీ పార్లర్‌లో ముస్తాబైన తలవెంట్రుకలు. వీలైనంత యెక్కువ బట్టనుపయోగించి కుట్టిన పసుపురంగు చుడీదార్.

''జాహ్నవి సార్. రెండు సినిమాల్లో హీరోయిన్‌గా కూడా చేసింది. తమిళ్లో కూడా ఫేమస్సే. మీరు గుర్తుపట్టలేదా?'' రమణ్‌జీ ఆశ్చర్యపోయాడు.

జాహ్నవి పేవ్‌మెంట్ దగ్గరికొచ్చి నిల్చుని క్యూనోసారి కలియజూసింది. అయిదు నిమిషాల తర్వాత క్యూలోంచీ వో యువకుడు పైకి లేచి ఆమె దగ్గరికి నడిచాడు. ఆమె భుజాల పొడవున్నాడతను. సన్నటి అతడి శరీరంలో పొడవుగా సుడితిప్పిన మీసాలు యెబ్బెట్టుగా కనిపిస్తున్నాయి. నీలిరంగు పాంటు పైన లూజు లూజు కాటన్ చొక్కా రెపరెపలాడుతోంది.

రెండు మూడు నిముషాలు మాట్లాడిన తర్వాత, తన వానిటీ బాగులోంచీ గుప్పెడు నోట్లు తీసి అతడికేసి చాచిందామె. అతను శరీరమంతా మెలి తిరుగుతుండగా హావభావాలు ప్రదర్శించసాగాడు. కాస్సేపటి తర్వాత అతను దూరంగా వెళ్లిపోయాడు. జాహ్నవి అంతవరకూ అతను కూర్చున్న స్థలంలోకెళ్లి కూర్చొంది.

''ఆ కారు దగ్గిర నిలబడిన మనిషి అప్పట్నించీ నిన్ను రమ్మని పిలస్తావుండాడు, చూళ్లేదా నువ్వు'' అన్నాడు శీనూ మద్దులేటితో.

''నన్నా! యేఁట?'' అంటూ విస్తుపోయి, ''యిప్పుడే వస్తాను. కొంచెం నా తావు చూపెట్టుకోనుండు'' అని అతడికే తన స్థలాన్ని అప్పగించి కారు దగ్గిరికి నడిచాడు మద్దులేటి.

''వాట్ మాన్! తమిళ్, ఇంగ్లీష్ ఆర్ మలయాళం?'' అంటూ వాకబు చేశాడు కారు యజమాని.

''తెలుగు'' అన్నాడు మద్దులేటి.

''ఐ కెన్ మానేజ్ విత్ తెలుగు ఆల్సో. ప్లేసుకెంత తీసుకుంటావు?''

మద్దులేటి అయోమయంగా చూశాడు.

అతను వో పెద్ద నోటు మద్దులేటి చేతికిస్తూ ''బేరం వొద్దు. ఐ థింక్ దిస్ ఈజ్

మోర్దేన్ యెనఫ్. కమాన్'' అని అతను మద్దులేటి భుజం పట్టుకుని క్యూ దగ్గరికి లాక్కొచ్చాడు. తానే క్యూలో నిల్చుంటూ, గొంతు పెద్దది చేసి ''వోకే. నువ్వు పో..ఐ విల్ స్టాండ్ హియర్!'' అన్నాడు తనకు బాగా పరిచయమున్న వ్యక్తితో మాట్లాడుతున్నట్టుగా.

''తమాషాగా లేదుటండీ! యెవరూ జాహ్నవిని గుర్తుపట్టలేకపోయారు'' అయిదారు అడుగులు సారించే వరకూ రమణ్జీ మాటలు మద్దులేటికి వినబడుతూనే వున్నాయి. ''ఆమె గూడా మహాసభలకి వస్తున్నట్టుంది. పెద్దపెద్ద స్టార్లందరికీ ఆహ్వానాలొచ్చాయట. వాళ్లందరికీ వీసాలు అవే పరిగెత్తుకెళ్తాయి. విమానాల్లో స్పెషల్ సీట్లుంటాయి. అలాగని జాహ్నవి చిన్న ఆర్టిస్టేమీ గాదు. ఆమె స్టెప్పులేస్తే హాలుహాలంతా మోతే! మెడ్రాసులో తనకి లంకంత యిల్లుందట. చుట్టూ గార్డనే యెకరాలుంటుందట. ఆ మధ్య సిన్మా పేపర్లో వేశారు.''

***

''మధ్యానం నించీ యీ ముందరుండే యీధిలోనే నాలుగు తూర్లు విచారిస్తా తిరిగినాను. అంతా పెద్ద పెద్ద మాడీలే వున్నాయి. యెనకపక్కన్నే యట్లాంటి కాలనీ వుండాదని యెవురూ చెప్పలే. సాయంత్రం ఆ టర్నింగులో నువ్వుగాని కనబడక పొయ్యుంటే యింక యెనక్కు దిరుక్కోని పొయ్యుండాల్చిందే'' మాసి మెత్తబడిన దిండును గోడకానించుకుని కూర్చున్న మద్దులేటి పాత తమిళ పత్రికతో విసురుకుంటూ అన్నాడు.

కిరోసిన్ స్టవ్వు ముందు కూర్చుని సత్తుగిన్నెలో వుడుకుతున్న కూరను గరిటెతో కలయతిప్పుతున్న పోతన్న అతని మాటలు వినబడనట్టుగా మౌనంగా వుండిపోయాడు.

ఆరడుగుల వెడల్పుతో ఏడడుగుల పొడవున్న సందులాంటి గది. కిరోసిన్ పొగతో నల్లబారిన గోడలు గుడ్డిగా వెలుగుతున్న విద్యుద్దీపపు వెలుతురులో మరింతగా డీలాపడిపోతున్నాయి. గోడకున్న తలుపులు లేని అలమారునిండా రకరకాల పాత్రలూ, డబ్బాలూ, బట్టలూ క్రిక్కిరిసిపోయి వున్నాయి. మరో గోడకున్న చీలలపైనంతా మాసిన పాంట్లూ షర్టూ వేలాడుతున్నాయి. వొకదానిపైన వొకటిగా పేర్చిన రెండు ట్రంకు పెట్టెల పక్కన, సగం వరకూ నీళ్లున్న ప్లాస్టిక్ బకెట్లు రెండున్నాయి. యెదుటి గోడకున్న కిటికీ కింది తలుపులు రెండూ మూసేసి, అలమారుగా మార్చుకోవడంతో అక్కడ అద్దమూ దువ్వెనా, నూనెసీసా, పౌడరు డబ్బా స్థలం సంపాదించుకోగలిగాయి. తెరిచిన కిటికీ తలుపుల్లోంచీ దూరంగా మండుతున్న మంటల డాలు ప్రతిఫలిస్తోంది. చర్మం కాలుతున్న కమురు వాసన కడుపుని తిప్పేస్తోంది. యిదేమీ పట్టనట్టుగా పోతన్న మాత్రం గరిటెలోంచీ కొద్దిగా కూరను గరిటెతో పైకెత్తి తన్మయత్వంతో రుచి చూస్తున్నాడు.

''యింత పెద్ద వూళ్లో యిది తప్ప యింకో చోటు దొరకలేదా నీకు? శ్మశానానికింత పక్కంగా యీడెందుకు యిండ్లు కట్టినారు వీళ్లు?'' తల తిప్పితే శ్మశానంలోంచీ మంటలు కనబడతాయేమోనని బయపడుతూ అడిగాడు మద్దులేటి.

గిన్నెలోకి స్పూనుతో పసుపు పొడి రాలుస్తూ ''భలేట్టోడివే. యిండ్లు గట్టకుండా యింత

పెద్ద బరియల్ గ్రౌండు నెట్ల యిడిసి పెట్టినారు వీళ్లు అని నేను అనుమానపడతాంటే''
అంటూ సాగదీశాడు పోతన్న.

స్మశానంలోంచీ టపటపమన్న శబ్దం వినిపించింది. మద్దులేటి శరీరంపైన వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి.

''దినమ్మూ యీ మాదిరిగా కాలతానే వుంటిందా అక్కడ?'' వణుకుతున్న గొంతు తనకే చిత్రంగా అనిపిస్తుండగా మద్దులేటి ప్రశ్నించాడు.

''యీ పొద్దు తక్కువలే. వొక్కోప్పుడవుతే పదిరవై మంటలు మండతాంటాయి. యీ సైడ్లో యిదొక్కటే బరియల్ గ్రౌండు. యీ మధ్యనే ఎలక్ట్రికల్ క్రిమెటోరియం పెట్టినారంట. అయినా రష్ తగ్గటం లే'' మరోసారి కూరను శబ్దం చేస్తూ జుర్రుకుని ఆ తర్వాత చెప్పసాగాడు పోతన్న. ''ఆపక్క అది. మన రూంలో మనం. ఆడేం జరగతాందో మనకేలబ్బీ. ఆ మాటకొస్తే దినమ్మూ కొన్ని నూర్ల మంది పైకి బోతాంటారు. రోడ్డుమింద దినానికొకటిటి రెండు పీనిగల్నయినా చూస్నానే వుండాల్ల. అట్లనిజెప్పి మన పనులు మనం చెయ్యాటంలే. దానికదే దీనికిదే. అవుతే వొకటి. యీ బరియల్ గ్రౌండు పక్కనని చెప్పి యీ రూం రెంటు చీప్‌లో పడింది. నెలకు నన్నూరు. మా రూంమేటుకు యిన్నూరు. నాకిన్నూరు.''

'' యీ రూంలో నీకు రూమ్మేటుకూడా వుండాడా?'' మద్దులేటి ఆశ్చర్యపడి పోయాడు.

''లేకపోతే మొత్తం లెక్క నన్నేగట్టమంటావా? యెందుకు దండగ? నేను పొద్దున యెనిమిదికి పోయినానంటే రాత్రి యేడుకు వస్తాను. మా రూమ్మేటుకు సాయింత్రం ఆరునుంచీ తెల్లారి ఆరుదాంకా పని. అదేందో డైలీ పేపరులో వుద్యోగం. స్నానం గీనం చేసేదానికీ, వంటొండుకునేదానికీ, పండుకోని నిద్రపోయ్యేదానికే గదా రూం. పగుల్లో నేనుండను. రాత్రుల్లో వాడుండడు. అదీ సౌకిర్యం'' మసిగుడ్డతో పాత్రను స్టౌపైన్నుంచీ కిందికి దించి మంటను నీళ్లతో ఆర్పేశాడు పోతన్న.

కిరోసిన్ వాసన గదినంతా ఆక్రమించేసింది. బయటినుంచీ పెద్ద మూలుగు వినిపించింది!

''పక్కింటి ముసిలాయిన బాత్రూంలో పడకేసినట్టుండాడు. టయిం తొమ్మిదిన్నర యిండాల్ల. రారా భోంచేద్దారి'' అంటూ పోతన్న ప్లేటులోకి వేడివేడి అన్నంతోబాటూ కూరను కూడా వడ్డించాడు. కమురువాసనతో బాటూ కిరోసిన్ వాసనని పెనవేసుకున్న కూరవాసన ముక్కుపుటాలకు తగలగానే మద్దులేటికి కడుపులో దేవినట్టయింది.

బలవంతంగా రెండు ముద్దలు మింగి ''పక్కింటి పెద్దాయన బాత్రూంలో పండుకుంటాడా'' అని అడిగాడు మద్దులేటి.

''పక్కనుండేది గూడా యింత రూమే. అదే వంటిల్లూ అన్నీ. ఆయన యేందో బొమ్మల ఫ్యాక్టరీలో పనిచేస్తాడు. ఆ పెద్దాయన వాళ్లనాయిన. రాత్రుల్లో ఆయనా ఆయిన పెండ్లామూ వాళ్ల నాలుగేళ్ల పొట్టెగాడూ లోపల పండుకుంటారు. యీ రెండు రూంలకూ

వొకే బాత్రూం. రాత్రయితే పెద్దాయిన ఆడ్నే పండుకోవాల్ల. పైన రూఫ్ లేదుగదా. వానొస్తే పాలితిన్ కాగితమొకటి కప్పుకుంటాడు. అస్మా. రాత్రంతా మూలగతాంటాడు. ఆ మూలుగు వినపడ్లేదంటే ముసిలాయిన చెంబెత్తుకోని ఆ బరియల్గ్రౌండు యెనకపక్కుండే మురిక్కాలవలోకి పోయినాడూ అని అర్థం. అప్పుడింక తెల్లారి పోయిందనుకోని మనం గూడా ఆ పక్కకు బయల్దేరచ్చు''. మరోసారి కంచంనిండా వడ్డించుకుంటూ ''ఆఫీసుకాడ బెల్ ఫ్యాక్టరీవాళ్ల కాంటీనుండాది. ఆడయితే ఆర్రూపాయిలకే కన్సెషన్లో మీల్సు. మధ్యానాల్లో ఆడ్నే భోంచేస్తాను. రాత్రుల్లో మాత్రం వండుకోని ఫుల్మీల్స్ తినాల్సిందే'' అన్నాడు పోతన్న.

''నేను రాసిన జాబు చేరిందా లేదా నీకు?'' చాలాసేపటినుంచీ అడగలేకపోతున్న ప్రశ్నను చివరకు గుక్కిళ్లు మింగుతూ అడిగాడు మద్దులేటి.

బిగ్గరగా శబ్దం వచ్చేలా మంచినీళ్లు మింగుతూ ''నీ రీసెర్చి సీటు కతేమయింది?'' అని ప్రశ్నించాడు పోతన్న.

''యెంట్రెన్సులో సరిగ్గా యిరవయ్యయిదు మార్కులొచ్చి యెలిజిబిలిటీ వచ్చింది. మెరిట్ ప్రకారం యెంఫిల్లో సీటు నాదాంకారాదు. పీహెచ్డీలో సీటు గావాలంటే గైడు సైను చెయ్యాల్ల'' అన్నంలో ముగ్గులు గీస్తూ మద్దులేటి చెప్పసాగాడు. ''యెంత అడుక్కున్నా యెవురూ గైడు జేసే కొప్పుకోలే. రీడరు సిద్దయ్య మూర్తి దగ్గిర రెండు పీహెచ్డీ సీట్లున్నాయి. అడిగితే ఆయన పెద్ద లెక్చరిచ్చినాడు''.

తింటూనే ''యేమంటాడు?'' అని అడిగాడు పోతన్న.

''అడ్మిషన్లప్పటినించీ నన్ను గమనిస్తానే వుండాటంట. డిగ్రీలో ప్రతి సంవత్సరమూ నాలుగైదుసార్లు రాస్తేగానీ పాసుగాక పోయిందానివల్ల అప్లికేషనులో కూడా పెద్ద కట్ట సర్టిఫికెట్లు పెట్టినానంట. పోనీ యెమ్మేలో జేరినాంకయినా సబ్జెక్టుమింద కమిట్మెంటు లేదంట. రెండేండ్లలో యే పొద్దూ సరింగా పాఠం యినలేదంట. కొట్లాట కొస్తారని బయపడి క్లాసులో అందురికీ ధర్మం మార్కులేసినారంట. అందువల్ల పాసయిపోయి, యెంట్రెన్సులో జస్ట్ యెలిజిబిలిటీ దెచ్చుకోని ప్రాణం దీస్తా వుండానంట. కమిట్మెంటులేనోళ్లకు రీసెర్చిలెందుకన్నాడు'' చివరి ముద్దను బలవంతంగా మింగుతూ చెప్పాడు మద్దులేటి.

''యింక మీదట సరింగానే చదవతానని చెప్పలేకపోతివా?'' పాత్రలోని అన్నాన్ని గరిటెతో వూడుస్తూ అడిగాడు పోతన్న.

''ఆయనకు మాత్రం మన సంగతి తెలవదా? స్కాలర్షిప్పు వస్తాది. రెండేళ్లు కాలం తొయ్యవచ్చునని రీసెర్చిలో జేరతారని ఆయన కంప్లయింటు. నిజమే! దానికి గాకపోతే బో పొడిచేద్దామని యెవుడనుకుంటాండాడు?... యేందో హాస్టల్లలో సీట్లొస్తాండినాయని, అత్తెసరు మార్కుల్తో పాసయితాండినా కాలేజీలో సీట్లొస్తాండినాయనీ, యింతదాంకా చదివినాను. యెప్పుడు క్లాసులకు పోయినామో, యేం జదివినామో యెవుడికి తెల్సు.

యింటికాడుంటే రచ్చులూరంపుల్తో బతకాల. నిప్పుకోడి యిసకలో తల పూడ్చుకున్నట్టు సదువుల్లో మనుసుబెట్టినీకి యెవురివల్లయితింది? బోకమిట్‌మెంట్ లే తీ... మా అన్నింకా జైల్లోనే వుండాడు. వాళ్ల పిల్లకాయలిద్దరూ, ఆస్టల్లో జేరి సదవతాండారు. నేనాపక్క గనపడితే మా అమ్మను కూడా బయటికంపించి వేరే కాపరం పెట్టుకోమంటాంది మా వదిన. చదువుకున్నోడని కూలీక్కూడా యెవురూ పిలవాటంలే! కోర్టు యవహారాల్లో తల దూర్చినావని బైరైటీస్ పనులకెన్నడూ రానీడంలే! యెమ్మే ఫిలాసఫీ అంటే కాన్వెంట్ స్కూలోళ్లు గూడా టీచరు జాబు లేదంటాండారు...''

గిన్నెలు కడిగి లోపలపెట్టి, పాత చాప పరిచాడు పోతన్న. పాత దినపత్రికలు బొత్తిగా పెట్టి, దాని పైన టవలు కప్పి ''యిదే నీ దిండు. నువ్వాపక్క తల పెట్టుకుని పండుకో. నేనీపక్క తలపెట్టుకుంటాను. పక్కపక్కనే పండుకుంటే తావు జాలదు'' అన్నాడు పోతన్న.

బిడియంగా మద్దులేటి పడకపైన సర్దుకున్న తర్వాత ''యీడగూడా ధడీమని జాబుగావాల్లంటే దొరకతాదా? నాలుగేండ్లుగా వుండాను గాబట్టి, రెండు మూడు తావుల్లో చిన్న చిన్న వుద్దోగాలు, వొకటి రెండు తావుల్లో టైపింగ్ జేస్సావుండాను గాబట్టి, నెలకో రెండువేలు సంపాయిస్సాండా. యింటికంపించే దానికేమీ మిగలేదిలే. ఆ పక్క శ్రీపెరంబుదూరుకాడ ప్లాట్లేసినారు. నెలనెలా ఆరునూర్లు కడతాండాను. యింకో మూడేండ్లు కట్టాల. రెండు యాస్‌బెస్టాస్ సీట్లేసినా యిల్లే... ఆ పనయినాంకే పెండ్లని యింట్లో చెప్పేసినాను...'' అంటూ మాట్లాడుతూనే నిద్రలోకి జారుకుని, గురక పెట్టసాగాడు పోతన్న.

లైట్లార్పేశాక కిటికీలోంచీ మంటలడాలు బాగా పడుతోంది. పైన ఫాను తిరుగుతున్నా గదిలో గాలి ఆడటం లేదు. చెమట వాసన తప్పించుకోవడం కోసం ముఖమటు తిప్పుకున్నాడు మద్దులేటి. మురిక్కాలవ వాసన ముక్కుపుటాలకు తగిలింది. వున్నట్టుండి దిగ్గున లేచి కూర్చున్నాడు మద్దులేటి. పోతన్నను బలవంతంగా నిద్రలోంచీ లేపి ''ముసిలాయన మూలుగు యినపడాటంలే'' అన్నాడు కంగారుగా.

విసుగ్గా అతడినోసారి చూసి, మరోసారి అవులిస్తూ ''ముసిలోడు తావు ఖాళీ చేస్సాండాడేమో! వాళ్లవాళ్ల తమ్ముణ్ణి పిలుచుకొచ్చేకి పక్కింటామె పక్కింటాయనా పోటీ పడతాండారు. యెవురో వొకరొస్సారు...'' అని కాస్సేపాగి ''తెల్లారీ తెల్లారకముందే మా రూమ్మేటు వచ్చేస్సాడు. అట్లకాళ్లు ఆపక్కా, యిట్ల చేతులీ పక్కా యేసుకొని రూమంతా పనుకునేస్సాడు. నేనూ డూటీకి పోవాల్ల. నీ అడ్రసిచ్చేసి పో! యేదయినా జాబ్ దొరికితే జాబురాస్సాను'' అంటూ నిద్రలోకి జారిపోయాడు పోతన్న.

గదిలో ఫాను గరగరలతో బాటు పోతన్న గురకకూడా అంతకంతకూ పెరిగిపోసాగింది. స్మశానం నుంచీ చిటపటలు వినిపిస్తున్నాయి. దూరంనుంచీ యింకా వాహనాల సవ్వడి గూడా వినబడుతూనే వుంది. మురికి కాలువ దగ్గరనుంచీ అప్పుడప్పుడూ పంది పిల్లలు కీచులాడుకుంటున్న శబ్దం సైతం వినబడుతోంది. యెంతగా చెవులు రిక్కించి విన్నా

బయట పడుకున్న ముసలాయన మూల్గుడు మాత్రం యెంతకూ వినిపించక పోవడంతో మద్దులేటి భయపడుతూనే వుండిపోయాడు.

***

జెమినీ సర్కిల్ వాహనాల శబ్దాన్ని రెట్టింపు చేసే ఆంప్లిఫయర్‌లా తయారైంది. యెండ వేడికి కరుగుతున్న తారురోడ్డుపైన వాహనాలు ముద్రిస్తున్న టైర్ల గుర్తులు నగరపు సంచలన వార్తల్లా క్షణక్షణానికీ మారిపోతున్నాయి. అంతస్థులు అంతస్థులుగా పెరిగిన భవనాల చేతుల్లో దొరికిపోయిన ఆకాశం తెల్లగా బిక్కమొహమేసుకుని చూస్తోంది. దాదాపుగా సోషొచ్చి వుండలు చుట్టుకపోయిన వ్యక్తులతో క్యూ యెండగట్టిన చేపపిల్లల దారంలా కనిపిస్తోంది. పెద్దవుండని దొర్లించుకుంటూ వెళ్లే పేడపురుగులా నడివయసు మురికిబట్టల మనిషొకడు తనకంటె పెద్దదిగా వున్న పాత గోనెసంచిలో క్యూదగ్గర పడిన దినపత్రిక కాగితాల్ని, ఆయిల్ పేపర్లను ప్రోగు చేసుకుంటూ వెళుతున్నాడు.

క్యూపక్కనే నడుస్తూ ముందుకెళ్లిపోయిన టీషర్టు కుర్రాడు మళ్లీ వెనక్కు వచ్చి ''యిన్నాంగో! నీ సాయెన్నాచ్చి? రేపటి క్యూలో కూర్చుంటిరా?'' అని అడిగాడు. మద్దులేటి మౌనంగా వుండిపోవడంతో ''నాకు వీసాయిచ్చూడ్సిపారు'' అని విజయగర్వంతో ప్రకటిస్తూ ముందుకెళ్లిపోయాడు. వెనకే కాళ్లీడ్చుకుంటూ వచ్చిన ముసిలాయన మద్దులేటిని చూడగానే జిప్‌బాగ్‌ను పక్కనపెట్టి ''దిక్కుమాలిన సంత! యీ వయసులో నేనాదేశంగాని దేశంలో స్థిరపడతానని అనుమానంట! రిటయిరు కాకమునుపే ట్రైచేసి వుండాల్సింది బాబూ! పొరబాటు నాదే!'' అని యింతలో యేదో జ్ఞాపకమొచ్చినవాడల్లే బాగ్ పైకెత్తుకుని ''వెళ్లాలి నాయినా! సర్కారు యెక్స్‌ప్రెస్ టయమైపోతుంది. మళ్లీ మూడు నెలల తర్వాత యింత ప్రయాణమూ తప్పదు...'' అని గసలు పోసుకుంటూ నడుచుకెళ్లిపోయాడు.

తన చోటును పక్క మనిషి కప్పగించి తోపుడుబండి దగ్గరికెళ్లి రెండు ఆమ్లెట్లు నాలుగు బ్రెడ్‌ముక్కలు తిన్నాడు మద్దులేటి. షోడా బండి దగ్గరికెళ్లగానే పక్కనే నిలుచుని దోసకాయ ముక్క నములుతున్న గుమ్మటంలాంటి యువతి అతడినోసారి తేరిపార జూసి ''నాకయితే టెన్షనే లేదు సుష్మా'' అంటూ తన పక్కనున్న పొట్టి పిల్లతో కబుర్లు కొనసాగించింది. ''స్పౌస్‌కు వీసా యివ్వకపోతే యింకెవరి కిస్తారు? వీసా యింకో గంటలో చేతికొచ్చేస్తుంది. తర్వాత వుడ్‌లాండ్స్‌లో పార్టీ యివ్వాలమ్మాయ్ నువ్వు!''

మళ్లీ క్యూలోకొచ్చి కూర్చున్నాడు మద్దులేటి.

రోడ్డుకటువైపున అడుగు వెడల్పున్న సిమెంట్ చప్టాపైన జానెడు వెడల్పున్న నీడలో మనుషులు బారులు తీరుతున్నారు. కడుపు చల్లబడటంతో కునికిపాట్లు పడసాగాడు. ముందుకు వొంగబోయిన అతడి భుజాన్ని పట్టి కుదుపుతూ ''జాగ్రత్తండీ! టౌను బస్సేదైనా వూగుతూ వచ్చిందంటే ప్రమాదం'' అన్నాడు గడ్డం యువకుడు.

తల విదుల్చుకుంటూ కళ్ళు తెరిచి మద్దులేటి యెండిపోతున్న పెదవుల్ని సాగదీయడానికి

ప్రయత్నించాడు.

క్యూలోని వ్యక్తిని అభ్యర్థించి మద్దులేటి పక్కనే కాస్త స్థలం సంపాదించుకుని కూర్చున్నాడు రమణ్జీ. ''శాంతాలక్ష్మి వాళ్ళేమైనా కనిపించారా మీకు? అదేనండీ, పొద్దున మీ పక్కన కూర్చున్నారే, డాన్సరూ వాళ్లు... మరేం లేదు. యెంబసీ వాళ్లు యేమైనా సర్టిఫికెట్లు కావాలన్నారు. యెలిమెంటరీ స్కూల్లో, హైస్కూల్లో చాలా సర్టిఫికెట్లే వచ్చాయి. ఆ తర్వాత బిజినెస్లో పడి యెప్పుడూ పాడలేదు. యిలా వీళ్లు అడుగుతారని తెలిసుంటే పాడుతూనే వుండేవాణ్ణి!'' అని వాపోయాడతను. కాస్సేపాగి స్వగతంలా ''ఫస్టుకే అక్కడ ప్రోగ్రాం. రెండు మూడు బిజినెస్ కాంట్రాక్టులైనా సంపాయించుకొని రాకపోతే యెంత వృధా!'' అని గొణుక్కున్నాడు. తర్వాత ''పొద్దున శాంతాలక్ష్మి ఫైల్లో కొత్త రూపాయ నోట్లలా తళతళమంటున్న సర్టిఫికెట్లు చూశాను. యేదో వొక అసోసియేషన్ పేరుతో రెండు సర్టిఫికెట్లు ప్రింట్ చేసుకుంటే సరిపోతుంది. రేపు సర్టిఫికెట్లతో వస్తానని వాళ్ల దగ్గర పర్మిషన్ తీసుకున్నాను. సార్, సార్ యెవరైనా యీవూరి ప్రెస్వాళ్లు తెలుసా మీకు!'' అంటూ మద్దులేటి చేతుల్ని గట్టిగా పట్టుకుని బ్రతిమాలసాగాడతను.

సుడితిప్పిన మీసాలున్న సన్నటి మనిషొకడు మద్దులేటి అవతలి భుజంపైన చెయ్యేసి ''కూపిడరాంగో'' (పిలుస్తున్నారు) అన్నాడు.

జేబులో మిగిలిన నోట్లను తడిపి చూసుకుంటూ, రమణ్జీ పట్టులోంచి విడివడి 'వస్తాండా పద' అంటూ పైకి లేచాడు మద్దులేటి.

రోడ్డుపై నడుస్తున్న బొమ్మలచొక్కా యువకుడొకడు మద్దులేటి వైపోసారి నిలబడి చూసి, యెక్కడ చూసిన ముఖమో గుర్తుకురాక తలగోక్కుంటూ, ''నీలిమా, చెప్పేదానికి మర్చిపోయినానను. నీ సారీలన్నీ సర్దుకో. అక్కడ కాస్ట్లీ!'' అని పక్కకు తిరిగి చూసి, బాగా ముందుకెళ్లిపోయిన పంజాబీ డ్రస్సు అమ్మాయిని ''ఆగాగు. నేనూ వస్తావుండాను గదా!'' అని విసుక్కున్నాడు

తన భుజంపైని చెయ్యి తియ్యకుండా లాక్కుపోతున్న ఆగంతకుడితో ''యింకా యాడికి? యెవరు నువ్వు?'' అని అడిగాడు మద్దులేటి అనుమానంగా

రోడ్డు మలుపు తిరిగి తర్వాత, పాత చర్చి గేటు పక్కనున్న నలుగురైదుగురు మనుషుల్ని చూపెట్టాడు మీసాలతను.

యెముకల ప్రోగులా కనిపిస్తున్న పొడవాటి మనిషి మద్దులేటిని తేరిపారజూసి ''యెంద స్టేట్కు డా పోతావుండావు గోబ్బీ!'' అని అడిగాడు కోపతాపాలేవీ ధ్వనించని తాపీస్వరంతో

మద్దులేటి పెదవులు కదిలాయి. మాటలు మాత్రం వూడిపడలేదు.

''యెందూరు డా?'' అతనే మళ్లీ ప్రశ్నించాడు.

''యెవ్వూరైతే నీకేంలే!'' అన్నాడు మద్దులేటి బింకంగా.

గుంపులోని వాళ్లందరిలోనూ కొంచెం బలంగా కనిపిస్తున్న వ్యక్తి మద్దులేటి భుజంపైన

చెయ్యివేసి, మరో చేత్తో అతడి జేబులో మిగిలిన నోట్లని బలవంతంగా వూడ బెరుక్కున్నాడు. మద్దులేటికి చెప్పలేనంతా కోపం వచ్చింది. మెలితిప్పిన వెదురుబద్దలా అతడిపైకి యెగిరి దూకాడు. అతను వొడుపుగా పక్కకు తప్పుకుని కాలు ముందుకు చాపాడు. మద్దులేటి దభీమని నేలపైన పడ్డాడు. గుంపులోని వాళ్లందరూ పెద్దగా నవ్వసాగారు.

నుదుటిపైన చీరుకుపోవడంతో పెద్దగా మంట పెట్టసాగింది అతడికి. కళ్లల్లో నీళ్ళు తిరిగాయి.

పైకి లేవనియ్యకుండా మరొకడు అతనిపైకెక్కి కూర్చున్నాడు.

''యిదు మెడ్రాసుడా! యింగి వునక్కిన్న పనికి యింగ యిట్లా దుడ్డువచ్చే పని వుండాదని మీ వూరుదాంకా తెల్సిపోయిందా?'' పొడవాటి వ్యక్తి అదే స్వరంతో అడిగాడు.

''నిన్న రాత్రి మౌంట్‌రోడ్డులో పోతాంటే పోలీసులు గదుముకున్నారు. యాడికి పోవాల్నో తెల్లే. యీపక్క క్యూలో మనుషులు కనపడితే వొచ్చి కూర్చుంటిని. అప్పుడు యిట్ల తావుకు కూడా లెక్కిస్తారని ప్రమాణపూర్తిగా తెల్దు నాకు...'' రెండు చేతులతోను మట్టిని చిర్లాడుతు, తనపైన కూర్చున్న వ్యక్తిని కిందికి తోయడానికి ప్రయత్నించసాగాడు మద్దులేటి.

''అన్నకు పురియాదుడా! కిండలా! యీపక్క యింక తెంబడితే తోలు వొలిచేద్దుము. మాదర్చేద్. యెవుడు వీసావోడో, యెవుడు పేసమ్ముకునేదానికి వచ్చుండాడో మాకు తెల్సుడా! నీ మాదిరి పుండాకోరుల్ని యిందర్ని జూసుండావు'' వోచేత్తో పిడికెడు జుట్టుపట్టుకుని చూపించాడు పొడుగు మనిషి.

అంతవరకూ నొక్కి పట్టుకున్న వ్యక్తి పట్టుసడలించగానే పైకి లేచి నిలుచుని ''నా లెక్క'' అని సైగ చేశాడు మద్దులేటి.

మీసాలతను అతను వీపుపైన పెద్దగా రెండు గుద్దులు గుద్ది ముందుకు తోస్తూ ''పోడా పో! లెక్క సరిపోడ్చి'' అని పెద్దగా నవ్వాడు.

''యివనుక్కు వోరడికుడుంగో. సిన్మాస్టారుకు చీప్పాయెండంకుడుత్త పొక్కిరి పయుయివను'' (వీడికో దెబ్బ యివ్వండి. సిన్మాస్టార్‌కి చీప్‌గా తావిచ్చి పోకిరీ వీడు) అంటూ గుంపులోంచి మరో వ్యక్తి మీసాలవాణ్ణి యెగతాళి చేస్తున్నాడు.

వెనుదిరిగి చూస్తే సాహసం చేయలేక ముందుకే నడిచాడు మద్దులేటి.

దూరంగా జెమినీ సర్కిల్ బ్రిడ్జికింద మొండి గుర్రాన్ని అదుపులో పెడుతున్న వీరుడి విగ్రహం సిమెంటు సాలిగూట్లో చిక్కుకున్న కీటకంలా దయనీయంగా కనిపిస్తోంది. అమెరికన్ కాన్సలేట్ భవనం గోడలకవతలున్న క్యూ మాత్రం కనిపించడం లేదు.

లోపల కోటల్లాంటి యిల్లెక్కడున్నాయో తెలియనివ్వకుండా పెరిగిన విశాలమైన తోటల పక్కన, బారులు తీరిన పెద్ద పెద్ద అంగళ్ల పక్కన, అయిదారు వాహనాలు వొకేసారి వెళ్తున్నా

యింకా బోలెడంత ఖాళీస్థలం కనిపిస్తున్న వెడల్పాటి రోడ్లపక్కన కాళ్లీడ్చుకుంటూ నడవసాగాడు మద్దులేటి.

తనలో స్థలంలేని మనుషుల్ని కిందికి విసిరేయలేని భూగోళపు భూమ్యాకర్షణ శక్తిపైన అతడికి బోలెడంత కోపం వచ్చింది. తన కోసమంటూ సూదిమొన చోటయినా లేని చోట బతుకుకాని బతుకు బతుకుతున్న తనలాంటి మనుషులపైన అలివిమాలినంత కోపమొచ్చింది మద్దులేటికి.

*(ఆగస్టు '96 - ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక)*